జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 24 జనవరి 2026 | సంపుటి: 18 | సంచిక: 319 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

విశ్వావసు నామ సంవత్సరం , మాఘ మాసము , ఉత్తరాయణము , శిశిర రుతువు, సూర్యోదయం : 06:45 AM , సూర్యాస్తమయం : 06:18 PM. దిన ఆనందాది యోగము : ధూమ్ర యోగము , ఫలితము: ధనసష్టము , కార్యహాని

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## మళ్లీ భగ్గుమన్న బంగారం ధర

**ఒక్కరోజులోనే ఐదువేలు పెరిగిన రేటు**

న్యూఢిల్లీ,జనవరి23(ప్రజాజ్యోతి): తగ్గినట్లే తగ్గిన బంగారం ధర మళ్లీ పెరిగింది. రోజురోజుకూ కొత్త గరిష్టాలకు ధరలు ఎగబాకుతున్నాయి. గ్రీన్‌లాండ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

మిగతా1 2లో..

## సింగరేణి టెండర్లపై విచారణ జరపండి

**2014నుంచి నేటి వరకు అన్నింటిపైనా విచారణ**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఎంపి చామల లేఖ**

న్యూఢిల్లీ,జనవరి23(ప్రజాజ్యోతి): సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని

మిగతా 2లో..

# విచారణ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్

సిట్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చా

లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు

లీకులను ఎవరూ నమ్మొద్దన్న కేటీఆర్

ఫోన్ ట్యాపింగ్‌లో ముగిసిన కేటీఆర్ విచారణ

దాదాపు 7 గంటలపాటు పలు రకాలుగా ప్రశ్నలు





హైదరాబాద్,జనవరి23(ప్రజాజ్యోతి): లీకులను ఎవరూ నమ్మొద్దు.. ఇది లీకు వీరుల ప్రభుత్వమని కెటిఆర్ ఎద్దేవా చేశారు. లీకులపై ఆధారపడి ప్రభుత్వం నడిపిస్తున్నారని సెటైర్లు గుప్పించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును సిట్ అధికారులు శుక్రవారం విచారణ జరిపారు. ఈ కేసులో కేటీఆర్‌ను అధికారులు పలు ప్రశ్నలు అడిగారు. కేటీఆర్‌ను సుమారుగా 7 గంటలకు పైగా ప్రశ్నించారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న తర్వాత మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు.

మిగతా 2లో..

## ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

**సృజన్ బాగోతంతో సిట్ నోటీసులు**

**రెండేళ్లయినా లీకుల వ్యావహారమేనా**

**కోల్ స్కామ్‌తో కాంగ్రెస్ పతనం ఖాయం**

**మీడియా సమావేశంలో హరీష్‌రావు విమర్శలు**

**విచారణకు ముందు నేతల సమాలోచనలు**

**బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్, హరీష్‌రావుల భేటీ**

**సిట్ విచారణపై పార్టీ నేతలతో సమాలోచనలు**

హైదరాబాద్,జనవరి23(ప్రజాజ్యోతి): సీఎం రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సెటైర్లు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. నాడు కోల్ స్కాం యూపీఏ ప్రభుత్వ పతనానికి కారణమైందని

మిగతా 2లో..

# మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయం

రూ. 3కోట్ల 70లక్షల నిధుల విడుదల

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవతో మంజూరు

న్యూఢిల్లీ,జనవరి23(ప్రజాజ్యోతి): ఎట్టకేలకు మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయాన్ని అందించింది. కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్ల 70 లక్షల నిధులను విడుదల చేసింది. గిరిజన కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం జాతరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులను విడుదల చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా నిధులు మంజూరు చేశాయి. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మేడారం జాతరకు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తరలివస్తుండటంతో.. భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిధులను విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 'గిరిజన సర్క్యూట్' పథకం కింద ఇప్పటికే మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం

మిగతా 12లో..

## మేడారంలో జనజాతర

**భారీగా తరలి వస్తోన్న జనం.. ప్రత్యేక రైళ్లను నడపనున్న రైల్వే**



వరంగల్,జనవరి23(ప్రజాజ్యోతి): సమ్మకక్క సారలమ్మ జాతరకు మేడారం జనసంద్రంగా మారుతోంది. జాతర ప్రారంభానికి ముందు జనం తండోపతండాలుగా వస్తున్నారు. వాహనాల రద్దీ పెరిగింది. ఇప్పటికే ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇప్పుడు దక్షిణమధ్య రైల్వే కూడా వివిధ ప్రాంతాల నుంచి వరంగల్, కాజీపేటల వరకు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు వెల్లడించింది.

మిగతా 12లో..



## అమెరికా మరో సంచలన నిర్ణయం

డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదులుగుతున్నట్లు ప్రకటన

వాషింగ్టన్,జనవరి23(ప్రజాజ్యోతి): అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అనేక విషయాల్లో దూకుడుగా వ్యవహరిస్తున్న ట్రంప్ సర్కార్ ఇప్పుడు ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వోనుంచి అధికారికంగా వైదొలిగింది.రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు

మిగతా 2లో..

## జనగణనకు కేంద్రం రంగం సిద్ధం

**33 ప్రశ్నలతో వివరాల సేకరణ**

గెజిట్ విడుదల చేసిన సర్కార్



న్యూఢిల్లీ,జనవరి23(ప్రజాజ్యోతి): దేశ వ్యాప్తంగా జనగణనకు రంగం సిద్ధమైంది. రెండు దశల్లో జనగణన చేపట్టాలని ఇప్పటికే కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. జనగణనలోనే కులగణన కూడా కేంద్రం చేపట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి తొలిదశ జనగణన ప్రారంభం కానుంది. తొలిదశలో గృహ గణన కోసం కేంద్ర హోం శాఖ ప్రశ్నావళిని రూపొందించింది. 33 ప్రశ్నలతో మోదీ సర్కార్ గెజిట్ విడుదల చేసింది. ఇంటి వివరాలతో పాటు ఇంటర్‌నెట్, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వాడకం,

మిగతా 12లో..

## సీతక్క పర్యటనలో ఉద్రిక్తత

**కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట**

జనగామ, జనవరి23(ప్రజాజ్యోతి): జనగామలో పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా..

మిగతా 12లో..

## నిరాధార ఆరోపణలతో పరువుకు భంగం

**మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు స్పీకర్ నోటీసులు**

వికారాబాద్,జనవరి23 (ప్రజాజ్యోతి): వికారాబాద్ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌కు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ లీగల్ నోటీసులు పంపారు. తన

మిగతా 12లో..

## సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

- బాసర, వర్గల్‌లో జోరుగా అక్షరాభ్యాసాలు
- ప్రత్యేక పూజలు చేపట్టిన భక్తులు



నిర్మల్,జనవరి23(ప్రజాజ్యోతి): దేశవ్యాప్తంగా వసంత పంచమి వేడుకలను భక్తులు ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్య, జ్ఞానం, వాక్చాతుర్యానికి దేవతగా పరిగణించే సరస్వతి దేవికి అంకితం చేయబడింది. జ్ఞానం, విద్య, కళలలో విజయం కోరుతూ ప్రజలు సరస్వతి దేవిని పూజిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సృజనాత్మక రంగాలలో ఉన్నవారికి చాలా ముఖ్యమైనది. మారుతున్న ఋతువుల ప్రారంభం, వసంతకాలం ఆగమనాన్ని సూచిస్తుంది. వసంత పంచమి నాడు సరస్వతి దేవిని భక్తగా పూజించడం వల్ల చదువుపై దృష్టి పెట్టడానికి, జీవితంలో సానుకూల మార్పులు వస్తాయని నమ్ముతారు. దీంతో పలు ఆలయాల్లో ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలోని బాసర,వర్గల్, ఓయూ క్యాంపస్ తదితర సరస్వతీ ఆలయాల్లో విద్యార్థుల సందడి కనిపించింది. అక్షరాభ్యాసాలకు చిన్నారులు తరలివచ్చారు. నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారి

మిగతా 2లో..



## వ్యవసాయం ఓ విజ్ఞానం

**జై కిసాన్‌కు తోడు.. జై విజ్ఞాన్.. జై అనుసంధాన్**

**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు**

**సూర్యాపేటలో పలు కార్యక్రమాలకు హాజరు**

సూర్యాపేట,జనవరి23(ప్రజాజ్యోతి): 'వ్యవసాయం ఒక విజ్ఞానమని' ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం ప్రస్తుతం జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ ,జై అనుసంధాన్ గా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా, మఠంపల్లి మండలం, మట్టపల్లి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని సతీ సమేతంగా దర్శించుకుని

మిగతా 12లో..

# సంపాదకీయం

## మహిళా శక్తికి ఐద్వా చిరునామా కావాలి !

మహిళలు అన్ని రంగాల్లో విప్లవం, విజయాలు సాధిస్తున్నా ఇంకా ఎక్కడో లోటు కనిపిస్తూనే ఉంది. నేటికీ మహిళలు భారతదేశంలో స్వేచ్ఛగా తిరగలేని దుస్థితలోనే ఉన్నారు. ధైర్యంగా ఒంటరిగా వెళ్లలేని పరిస్థితులు నేటికీ ఉన్నాయి. బట్టల విషయంలో ఇటీవల నటుడు శివాజీ చేసిన ఓ వ్యాఖ్యపై రచ్చ చేశారే తప్ప..అందులో నిజమెంత అన్నది మహిళలే ఆలోచించలేకపోయారు. అంగాంగ ప్రదర్శన, కురచ బట్టలు, అర్ధనగ్న ప్రదర్శన వంటివన్నీ ఏ స్వేచ్ఛ కిందకు వస్తాయో చెప్పాలి. యత్ర నార్యంతు పూజ్యతే....అన్న నానుడిని తుంగలో తొక్కాం. ప్రధానంగా మృగసామ్రాజ్యం ఇంకా నడుస్తోంది. ఈ సమాజం మారాలంటే ఇంకొంత కాలం పడుతుంది. అందుకు మనమంతా పోరాడాలి. మహిళలను, చిన్నపిల్లలను గౌరవించే దాకా పోరాడాలి. వారికి రక్షణ కల్పించే వరకు పోరాడాలి. వారు స్వేచ్ఛగా తిరగగలిగే పరిస్థితులు వచ్చే వరకు పోరాడాలి. ఇవన్నీ కూడా సమిష్టి పోరాటాలతోనే సాధ్యం అవుతాయి. పనిప్రదేశాలు, ఉద్యోగాలు, బస్సులు, రైళ్లు, రాజకీయ పార్టీలు, సినిమాలు.. విద్యారంగం..ఇలా ఒక్కటేమిటి అన్ని చోట్లా మృగాళ్ల పెత్తనమే తప్ప ఆడ పెత్తనం కానరావడం లేదు. నేటి పాలనలో మహిళలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. పోరాడి సాధించుకున్న హక్కులన్నీ కాలరాయబడుతున్నాయి. పాలనారంగంలో మహిళలు అక్కడక్కడా ఉంటున్నా న్యాయం దక్కడం లేదు. మమతా బెనర్జీ లాంటి మహిళ పాలనలో ఉన్న బెంగాల్లో కూడా నిత్యం అత్యాచారాలు సాగుతున్నాయి. ఇలాంటి వాటిపై మమతా బెనర్జీ పోరాడడం లేదు. తన పాలనలో మహిళలను సురక్షితంగా ఉన్నారని ధైర్యంగా చెప్పలేక పోతున్నారు. అంటే మహిళలకు అధికారం అప్పగించినా దానిని సరిగా వినియోగించడం లేదని సగటు మహిళ అర్థం చేసుకోవాలి. ఎంత ఎదిగినా పురుషాధిక్యం పోవడం లేదు. ఎందుకనే కారణాలను వెతకాలి. వాటిపై పోరాడాలి. స్త్రీలను మళ్లీ ఇంటికే, వంటింటికే పరిమితం చేసే ఆలోచన నుంచి బయటపటడం లేదు. లైంగిక దాడులకు గురిచేస్తున్నారు. రక్షణ కరువైన సమాజంలో బతుకుతున్నారు. ఇటువంటి నేపథ్యంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా అఖిల భారత మహాసభలు ఈ నెల 25 నుండి పోరాటాల గడ్డ తెలంగాణలో జరగబోతున్నాయి. తన భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుకోబోతున్న ఈ సభల సందర్భంగా ఐద్వా ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఎంతసేపు మనువాదం అంటూ తిట్టి పోసుకోవడం మానాలి. అసలు మనువాదం అంటే ఈ సమాజానికి తెలియదు. తెలిసిందల్లా ఆడవాళ్లను అణచివేయడం. దీనిపై ఐద్వా చర్చించాలి. అన్నింటికన్నా ముందు.. మహిళలను ఐద్వా గొడుగు కిందకు తీసుకుని వచ్చి ఉద్యమించాలి.ఇదేదో లెఫ్ట్ పార్టీల మహిళా సంఘం అన్న భావన నుంచి బయటపడేయాలి. హైదరాబాద్ నగరంలో ఐద్వా ఆలిండియా మహాసభలు జరగబోతున్న వేళ...ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించాలి. అంటే మహిళా సమాజం ఎదుర్కొంటున్న సమయలను చర్చించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మహాసభలకు అత్యంత ప్రాధాన్యం వుంది. ఇప్పుడు మహిళా లోకానికి చాలా అవసరమైన సూచనలు, సలహాలు చేయాల్సిన అవసరం ఐద్వాపై ఎక్కువగా ఉంది. మహిళల్లోనూ కులువివక్ష ఉంది. వర్ణ వివక్ష ఉంది. మహిళలంతా ఒక్కటే అన్న భావన నేటికీ రాలేదు. అందుకే మహిళల గొంతు ఇంకా బలంగా వినిపించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇంట్లోనే కాదు సమాజంలో కూడా కలసికట్టుగా నినదించే స్థాయికి రావాలి. అంతా కలిసి ఐక్యంగా ఉండేందుకు అవగాహన పెంచుకోవడమే కాకుండా, సమస్యలపై పోరాడే శక్తి ఉందని నిరూపించాలి. ఈ మహాసభలు అలాంటి ఉత్సాహాన్ని ఇస్తాయని సగటు మహిళకు ధైర్యం ఇచ్చేలా చేయాలి. ఎందుకంటే దేశ వ్యాప్తంగా అనేక అంశాలపై ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర ఐద్వాకు ఉంది. అసంఘటిత రంగంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. అవన్నీ ప్రేరణగా ముందుకు సాగాల్సిన గురుతర బాధ్యత ఐద్వా మీద ఉంది. ఎందుకంటే సోషల్ మీడియా పెరిగిన తర్వాత మహిళల హక్కులు దుర్వినియోగం అవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఐద్వా బాధ్యత తీసుకోవాలి. మహిళలను అశ్లీలంగా చూపే సినిమా సన్నివేశాలపై పోరాడాలి. సోషల్ మీడియాలో స్త్రీ వ్యక్తిత్వ హననం జరగకుండా నిలబడాలి. సమస్య ఏదైనా ఐద్వా పోరాడుతుందన్న సందేశం రావాలి. ఎందుకంటే వివిధ రంగాల్లో ఉన్న మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తమ తరపున మాట్లాడే వాళ్లు లేక చాలా మంది మహిళలు ఒంటరిగా బాధపడుతున్నారు. అలాంటి వారికి ఐద్వా గొంతుక కావాలి. ఎంత పురోగతి సాధించినా మహిళలంటే సమాజంలో చిన్నచూపు ఉంది. ముఖ్యంగా కుటుంబ వ్యవస్థలో మార్పు రావాల్సిన అవరసం ఉంది. అలాగే నేడు కులాలు, మతాల పేర మనుషులను చీల్చుతున్నారు. అందులో మహిళలు ఎక్కువగా బలైపోతున్నారు. కనుక ప్రస్తుత పరిస్థితుల్లో ఐద్వా కృషి మరింత పెరగాల్సిన అవసరం ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మంది రైతు మహిళలు తుపాకీ చేతబట్టి పోరాడటమే గాకుండా, అలనాటి వర్గ పోరాటాల్లో ముందు నిలిచిన వీరనారి ఐలమ్మలను కన్న నేల ఇది. సమాజం విముక్తితోనే స్త్రీ విముక్తి ముడిబడి ఉందన్న లక్ష్యం రావాలి. మహిళను ఇంకా వంటిమనిషిగా, విలాసవస్తువుగా చూసే దౌర్భాగ్యం పోవాలంటే ఐద్వా పోరాటాలు మరింత పదునుదేలాలి. 33 శాతం మహిళ రాజకీయ రిజర్వేషన్లు హక్కుగా తక్షణం అమల్లోకి వచ్చేలా పోరాడాలి. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం, ప్రాధాన్యం పెరగాలి. అందుకోసం పోరాటం చేయాలి. కేవలం చదువుకున్న కార్పోరేట్ మహిళలకు అధికారం వస్తే సరికాదు...నిమ్న, బడుగు బలహీన వర్గాల మహిళల చేతికి అధికారం దక్కాలి. సామాజిక న్యాయ పోరాటంలోనూ మహిళల ఐక్యతను బలంగా చాటాలి. స్త్రీని వంటగదికి, సంతాన ఉత్పత్తికి, పురుషునికి సేవ చేసే సేవకురాలిగా పరిమితం చేయాలని చూస్తున్న ఈ సమాజంపై తిరుగుబాటు రావాలి. అభ్యుదయ ఆలోచనలతో ప్రజా ఉద్యమాలు నిర్మించవలసిన అవసరం ఉన్నదని గుర్తించి ఐద్వా విస్తృతంగా తన పరిధిని పెంచుకుని ప్రతి మహిళకు గొడుగు కావాలని ఆశిద్దాం.

# విచారణ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్

మొదటిపేజీ తరువాయి..

ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్




పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. లీకులతో తమకు సంబంధం లేదని అధికారులు చెబుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. కొంతమంది హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసి.. బెదిరించామని బయట ప్రచారం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది వాస్తవమా? కాదా? అని సిట్‌ను తాను అడిగానని తెలిపారు. ఆ వార్తలు అవాస్తవమని అధికారులు చెప్పారని స్పష్టం చేశారు. అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై చర్యలేవీ అని తాను ప్రశ్నించానని అన్నారు. ఇప్పుడు తమ ఫోన్లు ట్యాప్ కావటం లేదా అని అధికారులను నిలదీశానని తెలిపారు. తన ప్రశ్నలకు సిట్ అధికారులు నీళ్లు నమిలారని విమర్శించారు. అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగి వేధించారని ధ్వజమెత్తారు. విచారణ పేరుతో వేధించడం తప్ప.. వీళ్లు చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. సింగరేణి టెండర్లలో దొంగలు దొరికారని ఆరోపణలు చేశారు.పారిశ్రామికవేత్తకు గన్ పెడితే సిట్ ఎందుకు వేయరు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రుల, సన్నిహితుల దోపిడీపై సిట్ వేయరా,,? అని నిలదీశారు. న్యాయం, ధర్మం అందరికీ ఒకేలా ఉండాలని చెప్పుకొచ్చారు. సెలక్టివ్‌గా లీకులు ఇచ్చి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తనను ఎవరితోనూ కలిపి అధికారులు విచారించలేదని చెప్పుకొచ్చారు. ఈ విచారణలో తాను తప్ప మరే రావు లేరని తెలిపారు. తనను విచారణకు మళ్లీ పిలుస్తామని అధికారులు అన్నారని... బాధ్యత గల ప్రతిపక్షంగా ఏ విచారణకైనా సహకరిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణ ముగిసింది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి దాదాపు 7 గంటల పాటు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు ఆయనను ప్రశ్నించారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన విరాళాలు, ఎలక్టోరల్ బాండ్లు.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొందరు వ్యాపారవేత్తలు, రాజకీయ నేతల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి కేటీఆర్‌పై అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. అలాగే ఈ కేసులో నిందితుడు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, కేటీఆర్‌ను కలిపి గంట పాటు విచారణ చేసినట్లు సమాచారం. సిట్ విచారణ అనంతరం కేటీఆర్ నేరుగా తెలంగాణ భవన్‌కు వెళ్లారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అగ్రనేతలు హరీష్ రావు, కేటీఆర్ విచారణ ముగియడంతో తదుపరి వంతు కేసీఆర్‌దేనని రాజకీయవరగాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు 22 సిట్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జూబ్లీహిల్స్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి వెళ్లి అధికారులు నోటీసులు అందజేశారు.

## ఇంకెన్నాళ్లీ డైవర్షన్ పాలిటిక్స్

మొదటిపేజీ తరువాయి..

ప్రస్తావించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కోల్ స్కాం నాందిగా మారిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ధి బాగోతం బయటపెట్టినందుకే నోటీసులు పంపించారని చెప్పుకొచ్చారు. కోల్ స్కాంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉడత బెదిరింపులకు భయపడేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు. ధైర్యం ఉంటే సిట్ విచారణ వీడియో బయటపెట్టాలని సవాల్ విసిరారు. లీకులతో ప్రభుత్వాన్ని ఎంతకాలం నడుపుతారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సిట్.. పొట్టు.. లట్టుకి భయపడేది లేదని ఎద్దేవా చేశారు. మీ అవినీతిని బయటపెట్టే వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణిలో సోలార్ పవర్ స్కాం బయటపడిందని ఆరోపించారు. నాడు సింగరేణి సిరుల గనిగా ఉండేదని తెలిపారు.
నేడు సింగరేణి సృజన్ గనిగా మారిందని విమర్శలు చేశారు. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు. మంత్రుల పంచాయతీ కాంగ్రెస్‌కు ఉరితాడులా మారిందని ఆక్షేపించారు. సృజన్ వ్యవహారం బయటపెట్టిన తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేదని విమర్శించారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే సిట్ నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహించారు. సిట్ విచారణపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. లోపల ఏదో జరుగుతోందని తప్పుడు లీకులు ఇస్తున్నారని ఆరోపించారు. లీకులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కట్టుకథలతో ఇంకెన్నాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతారని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి బంధువు భూ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టామని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆధారాలతో సహా బయటపెట్టేసరికి ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా అయ్యిందని ఎద్దేవా చేశారు. కుంభకోణం ఎలా బయటకు వచ్చిందని వారంతా తలలు పట్టుకుంటున్నారని తెలిపారు. సింగరేణిలో 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లో పెద్ద కుంభకోణం జరిగింది. ఎంఎస్ఎంఈలు పాల్గొనకూడదని మూడింటికి కలిపి ఒకేసారి టెండర్లు పిలిచారు. సోలార్ పవర్ టెండర్ అనుమతులు కఠినం చేశారు. ప్రభుత్వం అనుకున్న వారికి టెండర్లు కట్టబెట్టేందుకు నిబంధనలు మార్చారు. దేశ వ్యాప్తంగా ఒక మెగావాట్ సోలార్ పవర్ ఉత్పత్తికి రూ.3కోట్లు అవుతుంది. రాష్ట్రంలో



మాత్రం ఒక మెగావాట్ సోలార్ ఉత్పత్తికి రూ.5.04 కోట్లు ఇచ్చారు. అదనంగా సింగరేణి భూములు కూడా ఇచ్చారు. సింగరేణిలో సోలార్ పవర్ ఉత్పత్తికి రూ.214 కోట్లు అదనంగా చెల్లించారు. సింగరేణిలో మరో సోలార్ పవర్‌ప్లాంట్‌లోనూ స్కామ్ చేశారు. బొగ్గు కుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిన తర్వాతే కిషన్‌రెడ్డి సమీక్ష చేస్తున్నారన్నారు.
సిట్ కార్యాలయానికి వెళ్ళేముందు తెలంగాణ భవన్ లోపల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ అయిన కేటీఆర్, హరీష్ రావు లు..భేటీ అయ్యారు. ఆతర్వాత కేటీఆర్ మీడియా తో మాట్లాడారు. ఈ కేసులో ఏమీ లేదు. మాకు ఏం సంబంధం లేదని కేటీఆర్ తెలిపారు. పదిసార్లు పిలిచినా హాజరవుతా.. అటెన్షన్ డైవర్షన్ కోసమే ఈ కుట్రలు అని మండిపడ్డారు. రేవంత్.. తన మంత్రులతో సహా మా అందరి ఫోన్లు ట్యాప్ చేస్తున్నాడు అని కేటీఆర్ ఆరోపించారు. రూ.50 లక్షలతో నోటుకు ఓటులో దొరికిన ఒక దొంగ ఇవాళ ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే.. ఈ రాజకీయ కక్ష సాధింపులు అని అన్నారు. 6 గ్యారెంటీల మోసం, 420 హామీల దగా, సింగరేణి బొగ్గు కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఈ కుతంత్రాలు అని ÷ర్ అయ్యారు. నాలుగు కోట్ల ప్రజలను నయవంచన చేసిన ముఖ్యమంత్రిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ ను బొంద పెట్టేదాకా నిద్రపోం అని కేటీఆర్ తెలిపారు. విచారణలో ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతామని వెల్లడించారు. ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోంది.. కెసిఆర్ సైనికులు గా ఉద్యమం నుంచి ఉద్భవించిన నాయకత్వం బీఆర్ఎస్ ది అని అన్నారు. కెసిఆర్ నాయకత్వంలో పదేళ్లు అధికారంలో ఉన్నాము. మేము ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు.. మేము టైం పాస్ రాజకీయాలు చేయలేదు.. ప్రతిపక్షాలను వేధించ లేదన్నారు. విచారణ లకు భయపడే వారు ఎవరూ లేరని తెలిపారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయి లాగా మారిందని ఎద్దేవ చేశారు. రోజుకో అంశం తో డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. పుట్టిన భూమి సాక్షిగా అక్రమ, అనైతిక పనులు నేను చేయలేదు. నేను డ్రగ్స్ తీసుకుంటానని.. నాకు హీరోయిన్ లతో సంబంధాలు ఉన్నాయని ప్రచారం చేశారన్నారు. మా కుటుంబాలను ఇబ్బంది పెట్టారు.. అయినా నేను ఎప్పుడూ భయపడలేదు.. హీరోయిన్ ల ఫోన్ లు ట్యాప్ అయ్యాయని మీరే లీకులు ఇచ్చారు.. మళ్ళీ ఏమి లేదని మీరే అన్నారు. ఈ రాష్ట్రంలో ఇప్పుడు ఫోన్ లు ట్యాప్ అవ్వడం లేదని పోలీసులు చెబుతారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ విషయంపై డీజీపీ శివదర్ రెడ్డి మీడియా ముందు చెబుతారా అని ప్రశ్నించారు. బొగ్గు స్కాం ను హరీష్ రావు బయట పెట్టారు.. మంత్రులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదు.. హరీష్ రావు కు నోటీసులు ఇచ్చి పిలిస్తే.. వాళ్లకు ఎలా సమాధానం చెప్పాలో అలా చెప్పాడని తెలిపారు. రాష్ట్రంలో దోపిడి దొంగల ముఠా ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో కొందరు పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

## సరస్వతీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మొదటిపేజీ తరువాయి..

ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాసర పుణ్యక్షేత్రం. భక్తుల తో కిక్కిరిసిపోయింది. వసంత పంచమి సందర్భంగా అమ్మవార్ల కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ప్రత్యేక అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు మొదలయ్యాయి. వేకువ జామునుంచే భక్తుల రద్దీ కొనసాగుతోంది. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి నుంచి చదువుల తల్లి దర్శనం కోసం భక్తులు వేచి ఉన్నారు. చిన్నారుల అక్షర శ్రీకార పూజలు.. గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు కొనసాగాయి. వసంత పంచమిని పిల్లలకు పాఠశాల విద్య ప్రారంభించడానికి శుభప్రదంగా భావిస్తారు.

## మళ్లీ భగ్గుమన్న బంగారం ధర

మొదటిపేజీ తరువాయి..

స్వరం మారిన వేళ తగ్గుముఖం పట్టిన పసిడి ధర మళ్లీ పైకెగిసింది. డెన్మార్క్ అధీనంలోని ద్వీపాన్ని బలప్రయోగం ద్వారా స్వాధీనం చేసుకోబోమని ట్రంప్ ప్రకటించడంతో.. గురువారం బంగారంలో లాభాల స్వీకరణ కనిపించింది. అయితే, అది ఒక్క రోజుకే పరిమితమైంది. ఇరాన్ చుట్టూ అమెరికా బలగాలు మోహరించడంతో మరోసారి అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి మదుపర్లు బంగారం వైపు పెట్టుబడులను మళ్లిస్తున్నారు. బంగారానికి పెరిగిన డిమాండ్ కారణంగా మళ్లీ దీని ధర పెరిగింది. అంతర్జాతీయ విపణిలో బంగారం ధర ఔన్సు 5 వేల డాలర్లకు చేరువైంది. ప్రస్తుతం 4,945 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగా బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి పసిడి రూ.1,59,954 పలుకుతోంది. గురువారంతో పోలిస్తే ఒక్క రోజులోనే పసిడి రూ.5వేలు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.41 లక్షలుగా ఉంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ఔన్సు 98 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.3.25 లక్షలుగా ఉందని బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## సింగరేణి టెండర్లపై విచారణ జరపండి

మొదటిపేజీ తరువాయి..

టెండర్లపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో తలెత్తిన వివాదంపై తక్షణమే స్పందించి ఇద్దరు సభ్యులతో కూడిన బృందాన్ని విచారణకు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దు అంశానికే ఈ విచారణను పరిమితం చేయొద్దని కోరారు. సింగరేణిలో గడిచిన పదేళ్లలో జరిగిన అన్ని టెండర్లు, అధికారిక పక్రియలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తాను బలంగా నమ్ముతున్నానని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో 2014వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన అన్నిటెండర్లు, కాంట్రాక్టులు, అధికారిక నిర్ణయాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతోపాటు, ప్రస్తుతం కొనసాగుతున్న టెండర్ పక్రియలను కూడా ఈ విచారణ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడే దిశగా, గత పదేళ్లుగా టెండర్ల కేటాయింపుల్లో ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే, వాటిని తెలంగాణ ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. సింగరేణి లాంటి ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ రంగ సంస్థలో పారదర్శకత, ప్రజాహితాన్ని కాపాడటం అత్యంత అవసరమని చెప్పుకొచ్చారు. కిషన్‌రెడ్డి వెంటనే స్పందించి 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్ల పక్రియలను ఈ ఉన్నత స్థాయి విచారణ బృందం పరిధిలోకి తీసుకురావాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.

## అమెరికా మరో సంచలన నిర్ణయం

మొదటిపేజీ తరువాయి..

ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అగ్రరాజ్యం తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా తప్పుకుంటున్నట్లు తెలిపింది. అయితే ఇకనుంచి పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్‌వోతో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. అయితే డబ్ల్యూహెచ్‌వో నుంచి అగ్రరాజ్యం వైదొలిగే సమయానికి అమెరికా దానికి 260 మిలియన్ డాలర్ల (రూ.2,382 కోట్లు) బకాయిలను చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బెర్గ్ నివేదికలు వెల్లడించాయి. ఈ విషయంపై డబ్ల్యూహెచ్‌వో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ నుంచి తప్పుకుంటున్నట్లు అమెరికా వెల్లడించగానే సరిపోదని.. సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ పూర్తి కాదన్నారు.

# మంచిర్యాల కార్పొరేషన్‌పై బీజేపీ జెండా విజయం ఖాయం

- గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు
- బీజేపీ పార్టీలో భారీగా చేరికలు





**మంచిర్యాల, 23, జనవరి (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల కార్పొరేషన్ పై బీజేపీ జెండా విజయం ఖాయమని మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇంచార్జ్‌గా నియామకం అయిన బీజేపీ జాతీయ నాయకులు ప్రేమేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇంచార్జ్‌గా నియామకం అయిన ప్రేమేందర్ రెడ్డి శుక్రవారం మంచిర్యాల కార్పొరేషన్ పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నుంచి బీజేపీ పార్టీలో చేరారు. వారికి బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి లు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బిజెపిలో చేరిన వారిలో 58 వ డివిజన్ నుంచి మాజీ కౌన్సిలర్ బోట్ల సత్యం, 52 డివిజన్ నుండి హైటెక్ కాలనీ మాజీ అధ్యక్షులు చిట్టినేని హనుమంత్ రావు, 22 డివిజన్ రాజీవ్ నగర్ నుంచి దాసరి కనకయ్య గౌడ్- పద్మ, శ్రీరాంపూర్ 3వ డివిజన్ నుంచి బరుపాటి సుమలత – మారుతి, తిరుపతమ్మ, 5వ డివిజన్ నుండి చెరుకు మోహన్ దాస్, 56వ డివిజన్ నుంచి అడువల సురేష్, భారీగా యువకులు, మహిళలు నేడు బీజేపీ పార్టీలో చేరగా వారికి బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పై కాషాయం జెండా ఎగరడం ఖాయం అని అత్యధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం ఖాయమని ప్రేమేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, పెద్దపల్లి పురుషోత్తం, గాజుల ముఖేష్ గౌడ్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణ మూర్తి, అమిరిశెట్టి రాజ్ కుమార్, రంగ శ్రీశైలం, సత్రం రమేష్, మల్యాల శ్రీనివాస్, పట్టి వెంకట కృష్ణ, పానుగంటి మధు, తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాభ్యాస వేళ చిన్నారులకు అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో విద్య సామాగ్రి పంపిణీ



**తిర్యాని, జనవరి 23 (ప్రజాజ్యోతి) :** వసంత పంచమి పురస్కరించుకుని తిర్యాని మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అక్షరాభ్యాసం నిమిత్తం ఆలయానికి వచ్చిన చిన్నారులకు స్లేట్లు, పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ చదువుల తల్లి సరస్వతి దేవి జన్మదినోత్సవం రోజున చిన్నారుల విద్యా భ్యాసానికి తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల వెంకటేశం గౌడ్,కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు పున్నం హరీష్ కుమార్, సర్పంచ్ మడవి రాజేష్, పెరుమాండ్ల రంజిత్ గౌడ్, అర్చకులు అజయ్ శర్మ మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దోడ్డిగూడలో ప్రజాజ్యోతి క్యాలెండర్ ఆవిష్కరణ



**ఆసిఫాబాద్ టౌన్ జనవరి 23 ప్రజా జ్యోతి :** దోడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజాజ్యోతి క్యాలెండర్?ను గ్రామ సర్పంచ్ మాడవి నాగోరావ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుర్గం భీం రావు, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఏఎన్?ఎం గోదావరి, వార్డు సభ్యులు మాడవి జైరాం, పగ్గుబాయి సరోజ పాల్గొని క్యాలెండర్?ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాజ్యోతి క్యాలెండర్ ప్రజలకు ఉపయోగకరమైన సమాచారాన్ని అందిస్తుందని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

- సర్పంచ్ ఏదుల సుమలత
- ద్వాక్రా మహిళలకు 'ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీ



**తిర్యాణి, జనవరి 23 (ప్రజా జ్యోతి) :** మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆశయమని నాయకపు గూడ సర్పంచ్ ఏదుల సుమలత అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ద్వాక్రా సంఘాల మహిళలకు ఆమె 'ఇందిరా మహిళా శక్తి' చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని, స్వయం ఉపాధి దిశగా మహిళలను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సంఘాల ద్వారా పొందే రుణాలను సరైన మార్గంలో పెట్టుబడిగా పెట్టి, కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొదురుపాక పవన్, వెలుగు సిసి తిరుపతి, వి.ఓ.ఏ సంతోష్?తో పాటు బుద్దే విజయ్, చుంచు బాపురావు, బుద్ధి చిన్నయ్య, శేఖర్, బాలయ్య, చంద్రమౌళి, భీమయ్య, వెంకటేశం, సంజీవ్, కిష్టయ్య మరియు వార్డు సభ్యులు పుష్పలత, మంగ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ డీసీసీ కార్యాలయంలో మాజీ అధ్యక్షుడి స్వాగతం సన్మానం



**ఆసిఫాబాద్ టౌన్ జనవరి 23 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్ పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు ని డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి ఆత్రం సుగుణక్క శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రానున్న మున్సిపాలిటీ ఎన్నికల వ్యూహాలు, పార్టీ బలోపేతం, ఎన్నికల్లో విజయానికి చేపట్టవలసిన ప్రణాళికలపై విస్తృత చర్చ జరిగింది. డీసీసీ కార్యాలయం, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. పార్టీ అభివృద్ధి, నియోజకవర్గ సంక్షేమ కార్యక్రమాల విస్తరణపై కూడా ముఖ్యమైన ప్రణాళికలు చర్చించబడ్డాయి.

## స్వతంత్ర సమరయోధుడు యువతకు స్ఫూర్తి ప్రదాత

– సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని



**మామడ జనవరి 23 (ప్రజా జ్యోతి) :** మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో గల అంగడి బజార్ లో గ్రామ వీడిసి ఆధ్వర్యంలో శుక్రవారం సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఆంగ్లీయుల పాలన నుంచి దేశాన్ని విముక్తి చేసిన మహోన్నత నాయకులలో సుభాష్ చంద్రబోస్ ఒకరని అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్యాల రాజారెడ్డి, విడిసి క్యాషియర్, నిమ్మ తోట గంగారెడ్డి, గ్రామపంచాయతీ సెక్రెటరీ మరియు గ్రామ ప్రజలు, హిందూ వాహిని యువకులు పాల్గొన్నారు.

## బాసరలో వైభవంగా వసంత పంచమి ఉత్సవ వేడుకలు

- బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్
- వసంత పంచమి సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జనవరి 23, (ప్రజాజ్యోతి) :** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని శుక్రవారం వసంత పంచమిని పురస్కరించుకొని, రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీకి స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోత్తరంగా అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు ఆమెకు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఎంతో ప్రఖ్యాతి చెందిన బాసర ఆలయానికి దర్శనానికి రావడం సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. వసంత పంచమి పర్వదినానికి సంబంధించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించామని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు పటిష్ట ఏర్పాటు చేస్తామని వివరించారు. 200 కోట్ల రూపాయల నిధులతో, బాసర అభివృద్ధికై మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు వివరించారు. బాసర దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, ముధోల్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో అంజనా దేవి, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా పంచముఖ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ద్వి మాసోత్సవ యజ్ఞ కార్యక్రమం మహా అన్నదానం





**ఖానాపూర్ జనవరి 23 (ప్రజా జ్యోతి) :** భక్తులు అత్యంత శక్తిమహన్ గా గ్రామాల్లో కొలిచే మొట్టమొదటి దైవసమూకుడు ఆంజనేయ స్వామి పవిత్ర ఉత్తరవాహిని నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని కొమరం భీమ్ చౌరస్తాలో గల శ్రీశ్రీశ్రీ పంచముఖ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం పండితులు నిమ్మగడ్డ శరత్ శర్మ ఆలయ అర్చకులు తిరునగరి నందకిషోర్ ఆచార్యుల ఆధ్వర్యంలో యజ్ఞం జరిగింది గత రెండు నెలల క్రితం ప్రతిష్టించిన ఈ ఆలయంలో ప్రతి మాసానికి ఒక మారు ఉత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు సంవత్సరం పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ సందర్భంగా పవిత్ర వసంత పంచమి రోజు ద్వి మాసోస్తవ పూజ ఇక్కడ జరగడం అదృష్టమని ఈ యజ్ఞ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు అల్లాడి వెంకటేశ్వర్లు రమ దేవి సీనియర్ పాత్రికేయులు మంత్రరాజం దేవేందర్ అన్నపూర్ణ ఆలయ కమిటీ నిర్వాహకులు తుమ్మనపల్లి లక్ష్మణ్ సుజాత సాదుల లక్ష్మీనరసయ్య కృష్ణవేణి దంపతులచే నవగ్రహ మన్య లక్ష్మి నారాయణతో పాటు ఆంజనేయ విగ్నేశ్వర హోమ కార్యక్రమాలను శాస్త్ర యుక్తంగా శరత్ శర్మ,నందకిషోర్ ఆచార్యులు నిర్వహించారు పంచముఖ హనుమాన్కి ఉదయాన్నే పంచామృత అభిషేకం చేసి హోమం నిర్వహించారు ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని విచ్చేసిన భక్తులకు ఏర్పాటుచేసి స్వామివారి తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలు పొందారు ప్రతి మాసంలో ఇలా యజ్ఞ ఉత్సవాలను నిర్వహించి సంవత్సరం పాటు యజ్ఞ హోమాదులు జరపడం వల్ల స్థల ప్రతిష్టతో పాటు పంచముఖ హనుమాన్ దీవెనలు గ్రామ ప్రజల శాంతి సౌభాగ్యాలతో పాటు ఆరోగ్య ప్రకారాలను పెంచుతోందని పండితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తోట హనుమంతు జోగు రాజేశ్వర్ వడ్ల భీమన్న బాలసంకుల రాజేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



**మామడ జనవరి 24(ప్రజా జ్యోతి) :** మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో గల అంగడి బజార్ లో గ్రామ వీడిసి ఆధ్వర్యంలో శుక్రవారం సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఆంగ్లీయుల పాలన నుంచి దేశాన్ని విముక్తి చేసిన మహోన్నత నాయకులలో సుభాష్ చంద్రబోస్ ఒకరని అన్నారు.

ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ చిట్యాల రాజారెడ్డి, విడిసి క్యాషియర్, నిమ్మ తోట గంగారెడ్డి, గ్రామపంచాయతీ సెక్రెటరీ మరియు గ్రామ ప్రజలు, హిందూ వాహిని యువకులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ, కాలువ పనులు ప్రారంభం

**మామడ జనవరి 24 (ప్రజా జ్యోతి) :** మమడ మండలంలోని పొన్కల్ గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో గల గత పదిహేను సంవత్సరాల నుంచి ఉన్న డ్రైనేజీ, నీటి కాలువ పనులను ఇటీవలే పంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన చిట్యాల లక్ష్మి రాజ రెడ్డి, వార్డు సభ్యుడు నిమ్మ తోట గంగారెడ్డి కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామం లో ప్రధాన సమస్యగా ఉన్న ఇందిరమ్మ కాలనీ లోని డ్రైనేజీ, నీటి కాలువ పనులను ప్రారంభించినందుకు కాలని వసూలు అంత నాయకులు సర్పంచ్ చిట్యాల లక్ష్మి రాజ రెడ్డిని మరియు వార్డు సభ్యుడు నిమ్మ తోట గంగా రెడ్డి పై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి , వి. రవి, సుబ్బారావు, వంశీ కృష్ణ, రఫీ, లక్ష్మణ్ తో పాటు కాలని వాసులు ఉన్నారు.



## వసంత పంచమి సందర్భంగా రమేష్ గౌడ్‌కు ఘన సన్మానం



**జైపూర్ జనవరి 23 (ప్రజా జ్యోతి) :** వసంత పంచమి పూజ పురస్కరించుకొని జైపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడైన రమేష్ గౌడ్‌కు ఘన సన్మానం నిర్వహించారు. అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల రమేష్ గౌడ్ నియమితులైన సందర్భంగా శుక్రవారం జైపూర్ ప్రెస్ క్లబ్‌లో ఈ సన్మాన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కరుణాకర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన రమేష్ గౌడ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.రమేష్ గౌడ్ మాట్లాడుతూ, తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జర్నలిస్టుల భద్రత, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. తనకు సన్మానం చేసిన జైపూర్ ప్రెస్ క్లబ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, దుర్గ ప్రసాద్, నరేష్, సాయిబాబా, రాము, సుభాష్, భీమరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై పిచ్చి మొక్కల తొలగింపు



**జైపూర్, జనవరి 23 (ప్రజా జ్యోతి) :** జైపూర్ మండలంలోని దుబ్బపల్లి నుంచి వెంకట్రావుపల్లి వరకు ఉన్న ప్రధాన రహదారి ఇరుపక్కల అధికంగా పెరిగిన పిచ్చి మొక్కలు, కొమ్మల కారణంగా వాహనదారుల తో పాటు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు సంయుక్తంగా చర్యలు చేపట్టి పిచ్చి మొక్కల తొలగింపు పనులు నిర్వహించారు.రోడ్డు ఇరువైపులా విస్తరించి ఉన్న పిచ్చి మొక్కల కొమ్మలను పూర్తిస్థాయిలో తొలగించి, రహదారి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ పనుల వల్ల రహదారిపై రాకపోకలు సులభమయ్యాయని, ప్రమాదాల అవకాశాలు గణనీయంగా తగ్గాయని స్థానికులు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ చర్యలకు గ్రామ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

## గంభీరావుపేట అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా వసంత పంచమి వేడుకలు



**తిర్యాణి, జనవరి 23 (ప్రజా జ్యోతి) :** మండలంలోని గంభీరావుపేట్ గ్రామపంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో వసంత పంచమి వేడుకలను టీచర్ జుమ్మిడి మల్లేశ్వరి శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గ్రామ సర్పంచ్ జూమ్మిడి కిష్టయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అమ్మవారి చిత్రపటానికి పూజలు నిర్వహించిన అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆయన స్వయంగా అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా స్వరూపిణి అయిన సరస్వతీ దేవిని పూజిస్తూ చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించే పవిత్రమైన రోజని కొనియాడారు. చిన్నారులు విద్యావంతులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ మహేష్, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ ప్రతి ఓటరు బాధ్యత

- నిర్భయంగా ఓటు వేయాలని పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్

వనపర్తి ప్రతినిధి, జనవరి 23 (ప్రజా జ్యోతి): ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు ఎన్నికల్లో తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. జనవరి 25న జాతీయ ఓటరు






దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం ఉదయం ఐ. డి. ఒ సి. సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఐ.డి. ఒ సి సిబ్బందితో ఓటరు దినోత్సవం పై ప్రతిజ్ఞ చేయించారు. భారత దేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడిలకు ప్రభావితం కాకుండా, ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య,మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, ఐ.డి. ఒ సి సిబ్బంది ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- రిటర్నింగ్ అధికారులదే కీలక పాత్ర : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, జనవరి 23 (ప్రజా జ్యోతి): త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, సందేహాలు ఉంటే ముందుగానే నివృత్తి



చేసుకోవాలని సూచించారు. శుక్రవారం ఐ.డి.ఒ.సి సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికలు రాజకీయ పార్టీల గుర్తులతో నిర్వహించబడతాయని, నామినేషన్ ప్రక్రియలో గుర్తుల కేటాయింపు, క్రమ సంఖ్య తదితర అంశాల్లో అత్యంత జాగ్రత్త అవసరమని తెలిపారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థికి సమాన అవకాశం కల్పించాలని, పత్రాల్లో లోపాలు ఉంటే నోటీసు ఇవ్వాలని సూచించారు. జనరల్ అభ్యర్థులకు రూ.2,500 డిపాజిట్ ఉండగా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. అభ్యర్థుల పేర్లు సంబంధిత మున్సిపాలిటీ ఓటరు జాబితాలో ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు, శిక్షణ నోడల్ అధికారి రామ మహేశ్వర్ రెడ్డి, ట్రైనర్ శ్రీనివాసులు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## "అరైవ్ అలైవ్" నినాదంతో మహబూబ్‌నగర్‌లో రోడ్డు భద్రత బైక్ ర్యాలీ

- హెల్మెట్ వాడకం ద్వారా ప్రాణ రక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జనవరి 23 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" నినాదంతో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ బైక్ ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమై క్లాక్ టవర్, అశోక టాకీస్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్,



మెట్టుగడ్డ యూ టర్న్ మీదుగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న పోలీసు సిబ్బంది హెల్మెట్లు ధరించి పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా ప్రయాణిస్తూ రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ, హెల్మెట్ వాడకం ప్రాణాలను కాపాడే అత్యంత ముఖ్యమైన రక్షణ సాధనమని తెలిపారు. "అరైవ్ అలైవ్" లక్ష్యాన్ని సాధించాలంటే ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చని తెలిపారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు శాఖ నిర్వహించింది.

# మిషన్ మధుమేహ దృష్టితో చూపు రక్షణ

- మధుమేహంతో చూపు కోల్పోయే ప్రమాదం
- మధుమేహ రోగులకు ఉచిత కంటి పరీక్షలు
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, జనవరి 23 (ప్రజా జ్యోతి): వనపర్తి జిల్లాలో వైద్య శాఖ ద్వారా నిర్వహిస్తున్న మిషన్ మధుమేహ దృష్టి కార్యక్రమంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని మధుమేహం వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. శుక్రవారం కొత్తకోట మున్సిపాలిటీలోని 14వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న రేటినోపతి ఉచిత వైద్య పరీక్షల కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైద్య శాఖ ద్వారా మిషన్ మధుమేహం 100 రోజుల కార్యక్రమం ద్వారా 30 సంవత్సరాల వయస్సు పైబడిన 3 లక్షల ఆరు వేల మందికి ఉచిత మధుమేహం వైద్య పరీక్షలు నిర్వహించి 19643 మంది వనపర్తి జిల్లాలో మధుమేహం వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. మధుమేహం వ్యాధిగ్రస్తులకు రేటినోపతి వ్యాధి సోకే ప్రమాదం ఉంటుందని, ఈ వ్యాధి దీర్ఘకాలంలో కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ వ్యాధిని గుర్తించాలంటే పెద్ద పెద్ద



కంటి ఆసుపత్రుల్లో మాత్రమే గుర్తించేందుకు అవసరమైన మిషన్లు ఉంటాయని కానీ ఫండస్కోపి ఎ.ఐ సాంకేతికతతో కొత్తగా వచ్చిన మిషన్ ద్వారా గ్రామాల్లో సైతం రేటినోపతి వ్యాధిని గుర్తించవచ్చన్నారు. ఎంత ముందుగా వ్యాధిని గుర్తిస్తే అంత సులువుగా వ్యాధి బారినుండి బయటపడొచ్చన్నారు. అందుకే వనపర్తి జిల్లాలో ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లాలోని మధుమేహం వ్యాధిగ్రస్తులకు గ్రామాలు, మున్సిపాలిటీల్లో 100 రోజుల దృష్టి కార్యక్రమం ద్వారా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 6007 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 385 మందికి రేటినోపతి, 9 మందికి గ్లకోమా వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. ఇందులో 341 మందికి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫాలో అప్ వైద్య చికిత్సలు అందిస్తుండగా 39 మందిని పెద్ద కంటి ఆసుపత్రులకు సిఫారసు చేసి వైద్యం చేయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య శాఖ ద్వారా మధుమేహం దృష్టి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు. ఉచిత వైద్య పరీక్షలు చేయించుకొని మిషన్ మధుమేహం దృష్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా సూచించారు. అంతకుముందు కలెక్టర్ కొత్తకోటలో కొత్తగా ప్రారంభించిన బస్తీ దవాఖానను, వికలాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా సాయినాథ్ రెడ్డి, కొత్తకోట తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావు, డా. పరిమళ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భ్రూణ హత్యల నియంత్రణ పై చర్యలు చేపట్టండి

- జిల్లాలో మాతృ శిశు మరణాలు సంభవించకుండా చూడండి
- మహిళలాల గర్భాశయ క్యాన్సర్ ను అరికట్టాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్ కర్నూల్ జనవరి 23 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) జిల్లాలో భ్రూణ హత్యలు, మహిళల గర్భాశయ క్యాన్సర్, మాతా శిశు మరణాలను నివారించాలని, ఈ బాధ్యత వైద్యులదేనని కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. భ్రూణ హత్యలు, మాతా, శిశు మరణాలు, మహిళలకు గర్భాశ క్యాన్సర్ శిశువులకు వ్యాక్సిన్లు గ్రామీణ ప్రాంత వైద్య సేవలు ఇతర అంశాలపై వైద్యాధికారులతో శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో డిఎంహెచ్ఓ డాక్టర్ రవి నాయక్ తో కలిసి వైద్యులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బందితో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ. నాగర్ కర్నూలు జిల్లాలో 1000 మంది అబ్బాయిలకు 892 మంది బాలికల నిష్పత్తి మాత్రమే ఉందని, ఇంకా ముఖ్యంగా చారకొండ లింగాల మండలంలో 1000 మంది అబ్బాయిలకు 650 అమ్మాయిల నిష్పత్తి ఉందని ఇది తీవ్రంగా ఆందోళన చెందించే విషయమని, వైద్యులు సూపర్వైజర్లు ఏఎన్ఎంలు జిల్లాలో భ్రూణ హత్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల నుండి ప్రజలు ఎక్కువగా కర్నూలుకు వెళ్లి మరి అబార్షన్లు చేయిస్తున్నారనే సమాచారం ఉందని అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా జిల్లా వైద్యశాఖను ఆదేశించారు. అబ్బాయిల నిష్పత్తి కంటే అమ్మాయిల నిష్పత్తి తగ్గుతే అది భావితరాలకు ప్రమాదకరంగా మారుతుందని అందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేసే పుట్టిన, పుట్టబోయే ఆడపిల్లల హత్యలపై అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 8 మాతృ మరణాలు, 58 శిశు మరణాలు గత సంవత్సరం నమోదయాయని ఈ నూతన సంవత్సరం నుండి జిల్లాలో ఏ ఒక్క మాతృ శిశు మరణాలు జరగకుండా వైద్యులు, సిబ్బంది గర్భిణీలకు సరైన అవగాహన కల్పించి పౌష్టికాహారం తీసుకునేలా, శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గించాలని అందుకు వైద్యులు, అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి పౌష్టికాహారం తీసుకునేలా



చూడాలని కలెక్టర్ సూచించారు.
మహిళలు గర్భం దాల్చినప్పటి నుండి డెలివరీ వరకు వారికి సరైన సమయంలో తీసుకోవలసిన చికిత్సలు జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో సిబ్బంది అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో మహిళల ఆరోగ్య విషయాల్లో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వైద్యులు అంకితభావంతో పనిచేయాలని, ఎటువంటి నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వరాదని తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల నిరక్ష్యం కారణంగానే మరణాలు సంభవిస్తున్నాయనే భావన ప్రజల్లో ఉండరాదన్నారు. ముందస్తుగా ఆసుపత్రిలో చేరి, ఎక్కువ రోజులు చికిత్స తీసుకుంటున్నా మరణాలు సంభవించడం బాధాకరమన్నారు. ఇటువంటివి ఇక పునరావృతం కారాదన్నారు. వారికి పరిస్థితులకు అనుగుణంగా వైద్యం అందించాలని, అవసరమైతే ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించి మెరుగైన వైద్యం అందే విధంగా కృషి చేయా లన్నారు. శిశు మరణాల నివారణకు అవసరమైన వ్యాక్సిన్లు సకాలంలో వేయాలని సూచించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాలు ఉన్నాయని, ప్రజలకు నమ్మకం కలిగిం చాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. అదేవిధంగా పుట్టిన శిశువు రెండు సంవత్సరాల వరకు అందించే 13 రకాల వ్యాక్సిన్ లను క్రమ పద్ధతిన వ్యాక్సిన్లు అందజేసేలా సిబ్బంది వైద్యులు తల్లులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.అదేవిధంగా మహిళలకు అవగాహన లేకపోవడంతో మహిళలకు సోకే అత్యంత ప్రమాదకరమైన గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్లను నివారించేందుకు జిల్లాలో ఉన్న పదివేల మంది 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల మధ్య గల బాలికలకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆరోగ్య విషయాల్లో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యులు అందుబాటులో ఉంటూ సరైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.
డిఎంహెచ్ఓ డాక్టర్ రవి నాయక్ మాట్లాడుతూ.... జిల్లాలో చేపట్టిన వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలను భ్రూణ హత్యలు, గర్భధార క్యాన్సర్, మహిళా శిశు మరణాలను ఈ సంవత్సరంలో జిల్లాలో ఎక్కడా జరగకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యంత పారదర్శకంగా సేవలందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అదేవిధంగా 14 సంవత్సరాల బాలికల అందరికీ వ్యాక్సిన్లు అందించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఈ సందర్భంగా డిఎంహెచ్వో తెలిపారు.
భ్రూణ హత్యలపై జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పించేలా అవగాహన గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు
ఈ సమావేశంలో అదనపు డిఎంహెచ్ఓ తారా సింగ్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ భీమా నాయక్, డాక్టర్ రఫిక్, డాక్టర్ కృష్ణమోహన్ ,డాక్టర్ భరత్ రెడ్డి, ప్రపంచ వైద్య ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ వషి , తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌కు శిక్షలు తప్పవు

- మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి ఆరు రోజుల జైలు

మహబూబ్‌నగర్, జనవరి 23 ( ప్రజా జ్యోతి బ్యూరో ) రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడే లక్ష్యంతో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠినంగా చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.
ఈ తనిఖీల్లో భాగంగా టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నిర్వహించిన డ్రంక్ అండ్



డ్రైవ్ తనిఖీల్లో అధిక మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఒక వాహనదారుడు పట్టుబడ్డాడు.
పట్టుబడిన వాహనదారుడికి ఆల్కహాల్ పరీక్ష నిర్వహించగా, అతని బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్ (బీ ఏ సీ) స్థాయి 288 ఎంజీగా నమోదు అయింది. అనంతరం అతడిని శుక్రవారం మహబూబ్‌నగర్ సెకండ్ క్లాస్ కోర్టులో హాజరు పరచగా, నమోదైన బిఎసి స్థాయి ఆధారంగా న్యాయస్థానం ఆరు (06) రోజుల జైలు శిక్షతో పాటు నగదు జరిమానా విధించింది. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తనతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా తీవ్రమైన ప్రమాదం ఉన్నందున, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా పోలీసు శాఖ ప్రజలకు హెచ్చరించింది.

## జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పోలీస్ సిబ్బందితో ఓటర్ల ప్రతిజ్ఞ

* ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి పునాది

గద్వాల జనవరి 22(ప్రజా జ్యోతి ప్రతినిధి): జనవరి 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ల దినోత్సవంను పురస్కరించుకొని,శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం ఘనంగా







నిర్వహించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై పోలీస్ సిబ్బందిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు.మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుంచి18 సంవత్సరాలకు తగ్గించడం ద్వారా యువతకు ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కల్పించారని గుర్తుచేశారు.యువత చురుకైన భాగస్వామ్యం వల్ల ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుతుందని తెలిపారు.ఓటు హక్కు ప్రతి పౌరుడికి లభించిన అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని,ఎన్నికల సమయంలో మతం,కులం,వర్గం,భాష లేదా ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా,స్వేచ్ఛాయుతంగా,నిస్పక్షపాతంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం చివరగా పోలీస్ అధికారులు,సిబ్బందితో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ కె శంకర్,గద్వాల డి.ఎస్పీ వై మొగిలయ్య,ఎ.ఆర్.డి.ఎస్పీ నరేందర్రావు,రిజర్వు ఇన్స్పెక్టర్లు వెంకటేష్,హరీఫ్,నరేష్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి,డి. సి.ఆర్.బి.ఎస్.ఐ సుకుర్,ఐటీ సెల్ ఎస్సైతేజస్విని,పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికల హక్కులపై విస్తృత అవగాహన

**- పోక్సో, బాల్యవివాహాల నిరోధం, లింగ నిర్ధారణ చట్టాలపై జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు**

మహబూబ్‌నగర్, జనవరి 23 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 0 నుంచి 18 సంవత్సరాల లోపు బాలికలకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ కార్యక్రమాల్లో ముఖ్యంగా బాలికలపై జరిగే లైంగిక వేధింపులు, దాడుల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు అమలులో ఉన్న లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పొక్సోయాక్ట్–2012) ద్వారా పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించడం, నేరస్థులకు కఠిన శిక్షలు విధించడం, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 121 పోక్సో కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. అలాగే భారతదేశ బాల్యవివాహాల నిషేధ చట్టం – 2006 ద్వారా బాల్యవివాహాలను అరికట్టేందుకు చట్టపరమైన కనీస వయస్సు (స్త్రీలకు 18, పురుషులకు 21)



నిర్ణయించి, వివాహాలను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 53 బాల్యవివాహాలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. బాలికలకు తమ హక్కులపై అవగాహన కల్పిస్తూ, తమను తాము రక్షించుకునే విధంగా శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.
జిల్లాలో ఆడపిల్లల లింగ నిష్పత్తి మెరుగుపరచేందుకు "బేటి బచావో బేటి పడావో" కార్యక్రమం ద్వారా కళాజాత కళాకారులతో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల ఫలితంగా జిల్లాలో లింగ నిష్పత్తి మెరుగుపడిందని పేర్కొన్నారు.
అదేవిధంగా గర్భధారణకు ముందు, ప్రసవానికి ముందు లింగ నిర్ధారణను పూర్తిగా నిషేధించే పీ సి ఎన్ డి టి చట్టం–1994ను కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వైద్యులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, లింగ నిర్ధారణను ప్రోత్సహించే వారిపై జైలు శిక్షతో పాటు జరిమానా విధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ కోసం డయాగ్నొస్టిక్ సెంటర్ల దుర్వినియోగం జరగకుండా కఠిన చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి పార్టీలకతీతంగా పని చేయాలి

వనపర్తి ప్రతినిధి, జనవరి 23 (ప్రజా జ్యోతి): వనపర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలందరూ సమానమేనని, పార్టీలకతీతంగా పనిచేసి గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి శివారులోని వైటీసీ (వైటిసి) యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి శుక్రవారం ఆయన హాజరై మాట్లాడారు. ఖిల్లా ఘణపురం, పెద్దమందడి, కొత్తకోట, మదనాపురం, అమరచింత, ఆత్మకూర్, గోపాల్పేట మండలాలకు చెందిన 133 మంది సర్పంచులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాలు, మురికి కాలువల శుభ్రత, విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి అభివృద్ధి పనిలో వార్డు సభ్యులను భాగస్వాములు చేయాలని, గ్రామ సభల్లో సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. గ్రామ వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచాలని, రైతు భీమా, భూ వివరాల అప్డేట్లపై ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని, సర్పంచుల గౌరవ వేతనం, పింఛన్ అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరుతూ గ్రామ సభల్లో తీర్మానాలు చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న సర్పంచులకు ఎమ్మెల్యే ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, అధికారులు, ఎంపీడీవోలు, సర్పంచులు పాల్గొన్నారు.





# కిట్స్ వరంగల్ విద్యార్థికి రూ.35 లక్షల ఉద్యోగావకాశం

## క్యాంపస్ నియామకాలలో 439 మందికి ఉద్యోగాలు



**హసన్‌పర్తి, జనవరి 23 (ప్రజాజ్యోతి) :** వరంగల్ కిట్స్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ నియామకాల్లో విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ ప్రక్రియలో బి.టెక్ మూడో సంవత్సరం విద్యార్థి శ్రీ సాయి చరణ్? కల్వచెర్లకు రూ.35 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగావకాశం లభించింది. 2025--26 విద్యా సంవత్సరం తొలి అర్ధవార్షికంలో 50కి పైగా బహుళజాతి సంస్థలు క్యాంపస్ నియామకాలు నిర్వహించగా, మొత్తం 439 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కిట్స్? చైర్మన్? కెప్టెన్? వి. లక్ష్మీకాంతరావు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో సమాచార సాంకేతికతతో పాటు ప్రధాన ఇంజినీరింగ్? రంగ సంస్థలు పెద్ద సంఖ్యలో విద్యార్థులను ఎంపిక చేశాయని కళాశాల యాజమాన్యం వెల్లడించింది. రానున్న రోజుల్లో మరిన్ని సంస్థలు ప్రాంగణ నియామకాలకు సిద్ధంగా ఉన్నాయని కోశాధికారి పి. నారాయణరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధిస్తూ నిరంతర సాధన చేయాలని ప్రిన్సిపాల్? ప్రొఫెసర్? కె. అశోకరెడ్డి సూచించారు. పది విభాగాలకు చెందిన చివరి సంవత్సరం విద్యార్థులు ఈ నియామకాలలో విజయవంతమయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# అల్టి ట్యూడ్ పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాస మహోత్సవం





**ఎల్కతుర్తి జనవరి 23 (ప్రజా జ్యోతి) :** ఎల్కతుర్తి మండలంలోని అల్టి ట్యూడ్ పాఠశాలలో గురువారం అక్షరాభ్యాస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సరస్వతీ పూజలు నిర్వహించి, వేద పండితుల మంత్రో చ్చారాణల మధ్య సాంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యాభ్యాసానికి తొలి అడుగు వేసిన చిన్నారులు అక్షరాలు రాస్తూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహం వ్యక్తం చేశారు. చదువుల తల్లి సరస్వతి దేవి ఆశీర్వాదాలతో తమ పిల్లలు మంచి విద్యతో పాటు సద్గుణాలు అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. సాంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించిన ఈ అక్షరాభ్యాస మహోత్సవం అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లల భవిష్యత్తు ఉజ్వాలంగా ఉండాలని ఉన్నత స్థాయికి చేరుకొని మంచి విద్యాబోధను నేర్చుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు గురువులు, పెద్దలను గౌరవించే మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, అంబాల లావణ్య, రమ్య, భవాని, రచన, మౌనిక, దివ్య, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా నిర్వాహకులు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్లాస్టిక్ రహిత మేడారం అందరి లక్ష్యం

## - ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** అరణ్యమే ఆలయంగా ప్రకృతే దేవతలు అనే భావనకు ప్రతీకగా నిలిచే మేడారం మహా జాతరలో ఈసారి ప్లాస్టిక్ నివారణపై ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ ప్రత్యేక దృష్టి సారించారు.వన దేవతల సన్నిధిలో ప్రకృతిని కలుషితం చేయరాదన్న సంకల్పంతో 'ప్లాస్టిక్ రహిత మేడారం' లక్ష్యంగా పోలీస్ అధికారులు స్వచ్ఛందగా తమ శాఖా సమన్వయంతో చర్యలు చేపట్టారు.మేడారం జాతర పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్?ను పూర్తిగా నిషేధానికి అడుగులు వేశారు.ప్లాస్టిక్ కవర్లతో కూడిన బఫ్ ప్లేట్లు,గ్లాసులు, బాటిళ్ల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు.వాటి స్థానంలో ప్రకృతి వరప్రసాదితమైన ఆకులతో తయారు చేసిన విస్తారాకుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.ఈ క్రమంలో శ్రీ వినాయక గ్రామైఖ్య సంఘం ములుగు మండలం,జగ్గన్న పేట మహిళల ఆధ్వర్యంలో ఆకులతో తయారుచేసిన విస్తారాకులను ఎస్పీ పరిశీలించారు.గుడ్డతో తయారుచేసిన సంచులు, కాగితపు ప్యాకెట్లను వినియోగించాలంటూ భక్తులకు సూచించారు.వన దేవతలకు చేసే పూజలతో పాటు,వనాల పరిరక్షణ కూడా భక్తులు తమ బాధ్యతగా ఉండాలన్నారు. అందరి సహకారంతోనే ప్లాస్టిక్ రహిత మేడారం లక్ష్యం సాధ్యమని ఎస్పీ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకాన్,ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్స నరసింహ మూర్తి,జిల్లా సమాఖ్య మేనేజర్ కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై కుట్రలు ఇది ముమ్మాటికీ రాజకీయ కక్షసాధింపు

## సిట్ నోటీసులపై భగ్గుమన్న హసన్‌పర్తి బీఆరస్ నాయకులు



**హసన్‌పర్తి, జనవరి-23(ప్రజాజ్యోతి) :** రాష్ట్రంలో పాలన గాలికొదిలేసి ప్రతిపక్షాల గొంతు నొక్కే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం నిమగ్నమైందని హసన్?పర్తి మండల బీఆరస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆరస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. హసన్‌పర్తి మండల బీఆర?స్ అధ్యక్షుడు బండి రజనీ కుమార్ అధ్యక్షతన గురువారం హసన్‌పర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సమస్యలను పక్కనపెట్టి, రాజకీయ ప్రత్యర్థులపై కక్షసాధింపు చర్యలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తున్న కేటీఆర్?ను రాజకీయంగా ఎదుర్కోలేకే ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, కేవలం రాజకీయ దురుద్దేశంతో సిట్ నోటీసులు జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. ఆరు హామీల అమలులో ఘోరంగా విఫలమైన ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ నాటకాలకు తెరలేపిందని విమర్శించారు. ఉద్యమం తప్పదు.నాయకులపై అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. కేటీఆర్‌కు అండగా హసన్‌పర్తి మండలం నుంచి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. కక్షసాధింపు రాజకీయాలు మానుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రేవంత్ సర్కార్‌ను హెచ్చరించారు. వెంటనే అక్రమ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీతంపేట గ్రామ సర్పంచ్ మేక రమ్య భగవాన్ రెడ్డి, హనుమకొండ జిల్లా మాజీ రైతుబంధు సమితి కన్వీనర్ సంగాల విక్టరీబాబు, ఎర్రగట్టు గుట్ట మాజీ చైర్మన్ చింతల లక్ష్మణ్, బీఆరస్ జిల్లా నాయకులు బోడ యుగేందర్, జన్ను కిషన్, గరిగ మురళి, ప్రశాంత్ రెడ్డి, గరిగ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠంలో సమ్మక్క సారలమ్మ పద్యనాటక ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

## పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న



**హనుమకొండ జనవరి 23 (ప్రజా జ్యోతి) :** ఆదివాసీల వనదేవతలైన సమ్మక్క సారలమ్మలు ఆత్మగౌరవానికి ప్రతీకలని, పీఠంలో సమ్మక్క సారలమ్మ జాతరపై పరిశోధనలు జరిగాయని, 2008లో మేడారం సమ్మక్క సారలమ్మ జాతర పుస్తకాన్ని తెలుగువిశ్వవిద్యాలయం వెలువరించిందని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో వరంగల్ తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ వారు ఈ నెల జనవరి 29న హనుమకొండ పబ్లిక్ గార్డెన్లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో సమక్క సారలమ్మ చారిత్రాత్మక పద్యవాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్ ను శుక్రవారం.. వరంగల్ హంటర్ రోడ్లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో జానపద గిరిజన విజ్ఞానపీఠంలో పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ గడ్డం వెంకన్న మాట్లాడుతూ పీఠం ఆధ్వర్యంలో జానపదులు, గిరిజనులపై అనేక పరిశోధనలు జరిగాయని, చరిత్రను వెలికితీసేలా ఇంకా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, పీఠం జూనియర్ అసిస్టెంట్ ఆమేర్ ఆలీఖాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసాని సురేష్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, డిటిపి ఆపరేటర్ విజయలక్ష్మి, ఆంజనేయులు, ఆశోక్, విద్యార్థులు శాంతి, శాలిని పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సమాచార హక్కు చట్టం బోర్డుల లోపాలు?

## తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజ్ కుమార్ కురుమ



**హనుమకొండ జనవరి 23 (ప్రజా జ్యోతి) :** గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆర్టిఐ బోర్డులు తప్పనిసరి సమాచార హక్కు చట్టం ఉల్లంఘనలపై చర్యలు అవసరం అని రాజ్ కుమార్ సమాచార చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ.సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు.అన్ని ప్రభుత్వ కార్యాలయంలో సమాచారం హక్కు చట్టం బోర్డులు స్పష్టంగా అప్డేట్ చేసి ఉంచడం తప్పనిసరి అని చట్టం స్పష్టంగా పేర్కొంటుంది.అని రాజ్ కుమార్ అన్నారు. అయితే అనేక గ్రామ పంచాయతీలు.మండల కార్యాలయాలు. మున్సిపల్ కార్యాలయాలు.జిల్లా కార్యాలయంలో.ఆర్టిఐ బోర్డులు లేకపోవడం.పాత సమాచారం పిఐఓ మొదటి అప్లికేషన్ అధికారుల వివరాలుఇవ్వకపోవడం. చదవడానికి వీలులేని విధంగా బోర్డులు చేరిగిపోవడం. వంటిఉల్లంఘనలు ప్రతి కార్యాలయంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. సమాచార హక్కు చట్టంలోని కొన్ని అంశాలు 4 (1)(గా) ఏమంటుంది సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1)(బి) ప్రకారం 17 అంశాలు ప్రతి ప్రభుత్వ అధికారి (పబ్లిక్ అథారిటీ) తన నిధులు అధికారాలు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పేరు లేదా ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ వివరాలు ఆర్టిఏ దరఖాస్తు విధానం. ప్రజలకు సులభంగా కనిపించే విధంగా ప్రదర్శించాలి. ఆర్టిఏ బోర్డులు పెట్టడం ఈ సెక్షన్ కింద తప్పనిసరి అధికారుల బాధ్యత. ప్రజలు అడగకముందే సమాచారం స్వచ్ఛందంగా (సుమోటో) గా అందించాలి"ఆర్టిఐ బోర్డు పెట్టకపోవడం అంటే స్వచ్ఛంద సమాచార వెల్లడి చేయకపోవడమే.

ఆర్టిఐ బోర్డు లేకపోవడం లేదా పాత సమాచారం ఉంచడం అంటే ప్రజల మౌలిక హక్కుల ఉల్లంఘన పరిపాలన నిర్లక్ష్యం ఇది చట్టపరంగా ఫిర్యాదు చేయదగిన అంశం.

**ఏ ఏ కార్యాలల్లో తప్పనిసరిగా ఉండాలి ఆర్టిఐ బోర్డులు తప్పనిసరిగా ఉండాల్సిన కార్యాలయాలు :** గ్రామపంచాయతీ కార్యాలయాలు మండల పరిషత్ (ఎంపీడీవో)కార్యాలయాలు. మున్సిపాలిటీ. కార్పొరేషన్ కార్యాల యాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం, అన్ని శాఖల జిల్లా. రాష్ట్ర కార్యాలయాలు ప్రభుత్వం పాఠశాలలు. ఆస్పత్రులు. పిఎస్‌యులు. ప్రస్తుత పి ఐ ఓ మొదటి అప్పిలేట్ అధికారుల వివరాలు తప్పనిసరిగా అప్డేట్ చేయాలి. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 ఉల్లంఘనల పై చర్యలు తీసుకోవాలి. చట్టం అన్ని జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వ కార్యాలయంలో ఆర్టిఐ బోర్డ్ లేకపోతే లేదా తప్పుగా ఉంటే సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1)(బి) కింద ఆర్టిఐ అప్లికేషన్. కలెక్టర్కు ఫిర్యాదు స్టేట్ ఇంప్రెషన్ కమిషన్కు కంప్లీట్ చేయవచ్చని చట్టం సూచిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని కార్యాలయంలో యూనిఫామ్ గా ఆర్టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సంస్థ కోరుతుంది.

# స్వాతంత్ర్యం అంటే అడిగి తీసుకునే బిక్ష కాదు.. పోరాడి సాధించుకోనే హక్కు..

## బీజేపీ పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్



**నర్సంపేట జనవరి 23 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట భారతీయ జనతా పార్టీ నర్సంపేట పట్టణ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ మాటలను గుర్తు చేస్తూ " మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వేచ్ఛనిస్తాను.." భారత స్వాతంత్ర్య పోరాట కాలంలో మంత్రంలా వినిపించిన సమర నినాదం ఇది.. 'ఛలో ఢిల్లీ ', 'జైహింద్ ' అంటూ ఆ మహా నాయకుడు ఇచ్చిన నినాదాలు ఈనాటికీ సజీవంగా ఉన్నాయి.. భరతమాత బానిస శృంఖలాలు తెంచడానికి విదేశీ నేలపై తొలి స్వతంత్ర భారత సైన్యాన్ని, తొలి స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన యోధుడాయన.. జననమే తప్ప మరణం లేని మహా నేత.. భారత దేశ ప్రజల హృదయాల్లో 'నేతాజీ'గా చిరస్థాయిగా నిలచిన అమరుడు.. అతి కొద్ది సంవత్సరాల ప్రజా జీవితంలో ఈన్నటికీ మరచిపోలేనంతటి అభిమానాన్ని చూరగొన్న మహోన్నత నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్.. జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జయంతిని 'పరాక్రమ్ దివస్'గా ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. నేడు ఆ మహనీయుని జయంతి వారికి నమస్సుమాంజలీలు అర్పిస్తూ..జైహింద్ ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిల్లా రామచందర్, సీనియర్ నాయకులు నూనె రంజిత్ పోనుగోటి రవీంద్ర చారి, సోషల్ మీడియా ఇంచార్జ్ కోమండ్ల సప్తగిరి, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్రబాబు, వరంగంటి రాజ్ కుమార్, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొంకిసా విగ్నేష్ గౌడ్,చిలువేరు అన్వేష్, తప్పెట్ల సతీష్, ఏబీవీపీ జిల్లా నాయకులు శ్రావణ్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి

## - అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ







**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జనవరి 23 (ప్రజాజ్యోతి) :** మేడారం జాతరకు వెళ్లే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కాటారం నుండి మహా ముత్తారం వరకు, భూపాలపల్లి నుండి గొల్ల బుద్దారం వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారుల మరమ్మత్తులు, గుంతల పూడ్చివేత, రోడ్డు వెడల్పు, సైన్‌బోర్డుల ఏర్పాటు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కమలాపూర్?లో జరుగనున్న మినీ మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. జాతర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రవాణా నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి రమేష్, తహసీల్దార్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# వల్బాపూర్ గ్రామంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

- లబ్ధిదారులకు 74,500 విలువైన చెక్కులు అందజేత



**ఎల్కతుర్తి జనవరి 23 (ప్రజా జ్యోతి) :** ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి గౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి తిరుపతిరావుకు 60,000, మరియు పంచనేని ప్రశాంత్ రావు కు 14,500 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. పేదలు, అవసరాల్లో ఉన్నవారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా మారుతోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారావు, రత్నాకర్ రావు, ముక్క ఐలయ్య, రామారావు, అంబాల రంజాన్, రఘునాథం, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జానపద గిరిజన విజ్ఞానపీఠంలో వసంతపంచమి వేడుకలు



**హనుమకొండ జనవరి 23 (ప్రజా జ్యోతి) :** వరంగల్ హంటర్ రోడ్లోని తెలుగు విశ్వవిద్యాలయం జానపదగిరిజన విజ్ఞానపీఠంలో శుక్రవారం వసంతపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న సరస్వతి అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి వసంతపంచమి విశిష్టతను వివరించారు. డాక్టర్ గడ్డం వెంకన్న మాట్లాడుతూ విద్యార్థులు కృషితో ఉన్నతవిద్యలను అభ్యసించి వారికి నచ్చిన రంగాలలో అత్యున్నతస్థాయికి చేరుకోవాలని ఆక్షాంక్షించారు. కార్యక్రమంలో పీఠం జూనియర్ అసిస్టెంట్ ఆమేర్ ఆలీఖాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసాని సురేష్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, బుక్ బేరర్ సిద్దోజు సునంద, సిబ్బంది ఆంజనేయులు, ఆశోక్, సులోచన, కస్తూరిబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# గోరి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జనవరి 23 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి పోలీస్ స్టేషన్?ను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ శుక్రవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణం, పరిసరాల శుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ విధానం తదితర అంశాలను జిల్లా ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్?కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించడంతో పాటు, త్వరిత న్యాయం, పారదర్శక సేవలు అందేలా ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా విధులు నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ సంకీర్త్ పేర్కొన్నారు.



## ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం

మోత్కూరు జనవరి 23 (ప్రజాజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలంలోని అనాజిపురం, జాతీయ ఓటర్ దినోత్సవం (ఎన్విడి) సందర్భంగా అనాజిపురం



ప్రాథమిక పాఠశాలలో ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని బిఎల్వో, వీఆర్ఏ ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీసు వెంకన్న, ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీసు వెంకన్న మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. చిన్నతనంలోనే విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ నైపుణ్యాన్ని పెంపొదించుకోవాలి

### షారాజీపేట గ్రామ సర్పంచ్ కంతి మధు

ఆలేరు జనవరి 23 (ప్రజా జ్యోతి): విద్యార్థులు యువత క్రీడ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుంది అని క్రీడలో రాణిస్తే సమాజంలో




మంచి గుర్తింపు వస్తుందని షారాజీపేట గ్రామ సర్పంచ్ కంతి మధు అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని షారాజీపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో క్రీడలో పాల్గొన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్,పి యి టి మధుసూదన్, ఉపసర్పంచ్ శ్రీధర్, డైరెకర్ కిష్టయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని హరితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### ఉపాధి హామీ నర్సరీ పనులను ప్రారంభించిన సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి

తుంగతుర్తి,జనవరి 23,(ప్రజా జ్యోతి): గ్రామాన్ని పచ్చని హరితం గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తామని సర్పంచి కుంచాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్నారం



గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో పాటు, నర్సరీ పనులను సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామీణ ఉపాధి అవకాశాలు పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధి లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు చెప్పారు.ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో అర్హులైన వారికి పని కల్పించడంతో పాటు గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతామని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో అవసరమైన మొక్కలను స్థానికంగానే పెంచే ఉద్దేశంతో నర్సరీ ఏర్పాటు చేయడం వల్ల హరితాభివృద్ధికి బలమైన పునాది పడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుండి రమేష్, ఉపసర్పంచ్ వెలిశాల సరిత వార్డు సభ్యులు కదారి సుకన్య, మరికంటి జానకమ్మ,ఫీల్డ్ అసిస్టెంట్ మోతే చంద్రకళ, గ్రామపంచాయతీ సిబ్బంది ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరినట్టు తప్పుడు ప్రచారం

మోత్కూరు జనవరి 23 (ప్రజాజ్యోతి)



యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ నిన్న నన్ను ప్రలోభాలను ఆశచుపి, అయోమయానికి గురించేసి బీజేపీలో చేరినట్లు ప్రకటించడాన్ని ఖండిస్తున్నానని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులు మెతుకు అంజయ్య ప్రకటనలో తెలిపారు. నేను ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ కూడ ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నానని తెలిపారు. ఉద్యోగ విరమణ తరువాత పార్టీలో కొనసాగుతూ ప్రజా సమస్యలపై దాదాపు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నానని, ఇప్పుడు కూడ సిపిఎం పార్టీలో జీవితాంతం కొనసాగాలని నిర్ణయించు కున్నానని అన్నారు. పట్టణ కమిటీ సభ్యునిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యునిగా కొనసాగుతున్నానని, నాకు బీజేపీతో కాని ఇతర ఏపార్టీతో ఏలాంటి సంబంధం లేదని నన్ను బీజేపీలో చేరినట్లుగా ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ఉన్నారు.

## నందికొండ కమిషనర్‌గా అశోక్ రెడ్డి బాధ్యతలు

### పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడి

### ఘనంగా సన్మానించిన మున్సిపల్ అధికారులు,సిబ్బంది

నాగార్జునసాగర్ జనవరి 23 (ప్రజా జ్యోతి): నందికొండ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా అశోక్ రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు,రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా నేరేడుచర్ల మున్సిపాలిటీ నుండి ఆయన నందికొండకు బదిలీ అయ్యారు ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించరు అనంతరం నేరేడుచర్ల నుంచి బదిలీపై వచ్చిన కమిషనర్‌కు మున్సిపల్ అధికారులు, సిబ్బంది,పట్టణ ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు,ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు,బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ నందికొండ పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు,ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలం దిస్తానని అన్నారు,పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుధ్యం,డ్రైనేజీ వ్యవస్థ మరియు తాగునీటి సరఫరాపై ప్రత్యేక



నిఘా ఉంచుతామని తెలిపారు,ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, పారదర్శకమైన వేగవంతమైన పాలన అందిస్తామని స్పష్టం చేశారు.మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీనివాస్ రావు,సైదారావు,కార్యాలయ అధికారులు మహేష్,బాలాజీ,తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి మైనారిటీ గురుకుల పాఠశాలలో 5 వ తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం

తుంగతుర్తి, జనవరి 23, (ప్రజా జ్యోతి): తుంగతుర్తి మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో 2026 _27వ విద్యాసంవత్సరానికి




ఐదవ తరగతి కి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ ఉమా రెడ్డి తెలిపారు.శుక్రవారం పాఠశాలలో మైనారిటీ నాయకులతో కలిసి ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు.
తమ పాఠశాలలో ఐదవ తరగతిలో 80 సీట్లు ఉండగా అందులో 52 సీట్లు మైనార్టీలకు మిగతా సీట్లు నాన్ మైనార్టీ కి కేటాయించినట్లు తెలిపారు. 6,7,8 తరగతులలో బ్యాక్లాగ్ సీట్లు ఉన్నాయని అవి కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అంతేకాక జూనియర్ కళాశాలలో ఎం ఇ సి, సీఈసీ, కోర్సులు ఉన్నాయని 40 సీట్లలో 28 సీట్లు మైనార్టీ విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మైనారిటీ విద్యార్థులతో పాటు ఇతర వర్గాల విద్యార్థులకు కూడా కొన్ని సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారందరూ నేటి నుండి సంబంధిత వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చు అని అన్నారు.ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య తో పాటు హాస్టల్ వసతి భోజనం, యూనిఫామ్ దుస్తులు, పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు.
అర్హులైన మైనారిటీ విద్యార్థులు నేరుగా పాఠశాలకు వచ్చి సీటు రిజర్వ్ చేసుకోవచ్చని లేదా ఫోన్ నెంబర్ 9908380590,7995057967 లో సంప్రదించవచ్చని తెలిపారు.అంతకు ముందు శుక్రవారం నమాజ్ సందర్భంగా స్థానిక మసీదులో మైనార్టీ నాయకులు మైనార్టీ గురుకుల ప్రవేశాలకు సంబంధించి పోస్టర్లు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు షేక్ హబీబ్. టి లక్ష్మణ్, సిహెచ్ చిరంజీవి, పి రాంబాబు, ఆర్ వెంకటేశ్వర్లు, తో పాటు మైనారిటీ నాయకులు మత గురువు మూలాన అబ్దుల్ ఆహాద్, ఎండి జాన్, షేక్ లాల్, అలీ సాబ్, షేక్ అన్వర్, అబ్దుల్లా, కరీం, వహీద్, సిద్దిక్, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కోసం బిజెపి చీలిక రాజకీయాలు

### బీజేపీ మతోన్మాద కుట్రలను తిప్పి కొట్టాలి

మోత్కూరు జనవరి 23 (ప్రజాజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ ప్రలోభాలకు గురిచేసి పార్టీలను విచ్చినం చేసే బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి అన్నారు. మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామంలో కురిమేటి యాదయ్య అధ్యక్షతన గ్రామశాఖ సమావేశం జరిగింది. బొల్లు యాదగిరి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ. ప్రలోభాలకు గురించేసి, పార్టీలను విచ్చినం చేసి మున్సిపల్ ఎన్నికల్లో లబ్ది పొందాలనే మతోన్మాద బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నడూ లేని విధంగా గత పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలపై పన్నుల బారాలు వేయడమే కాక, పేదలకు జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్నికూడ నిర్వీర్యం చేయడమే కాక, కార్మికులు రక్తాన్ని చిందించి పోరాడి సాధించుకున్న హక్కులను కూడ కాలరాసి, కార్పొరేట్ సంస్థలకు



కొమ్ముకాస్తూ, పేద ప్రజల, కార్మికుల పొట్టకొడుతుందని విమర్శించారు. మతవిద్వేషాలతో ప్రజలను రెచ్చకొట్టి రాజకీయ లబ్ధిపొందాలనే మతోన్మాద బీజేపీ విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వనం శాంతికుమార్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య, రాచకొండ కనకయ్య, బండి రవి, మెతుకు అంజయ్య, కురిమేటి సోమయ్య, మెతుకు సాయిలు, మెతుకు శేఖర్, రాచకొండ నవీన్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే విద్యార్థుల్లోని ప్రతిభ వెలుగులోకి

తుంగతుర్తి, జనవరి 23,(ప్రజా జ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తాయని ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మేరీ మదర్ ఆఫ్ హోప్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉత్సాహం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు




పెంపొందుతాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గెలుపు–ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం క్రీడల వల్లనే అలవడుతుందని అన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ ముందుంటాననీ భరోసా ఇచ్చారు. అనంతరం ఇటీవల జరిగిన మండల స్థాయి మరియు జిల్లాస్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభా కనబరిచిన విద్యార్థులకు సీల్డ్ మరియు మెమోరడం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ యువజన సంఘాల నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వసంత పంచమి నాడు చిన్నారులకు అక్షరాభ్యాసం

చింతపల్లి జనవరి 23(ప్రజాజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ పాఠశాలల్లో,అంగన్వాడీ కేంద్రాలలో అర్చనలు,చేసి పూజించారు.ఈ వసంత పంచమికి ఎంతో విశిష్టత ఉంది.




వసంత పంచమిని మాఘశుద్ధ పంచమి నాడు జరుపుకుంటారు.మాఘశుద్ధ పంచమి నాడు సరస్వతీ దేవి జన్మదిన వేడుకలు చేసుకుంటారు.ఈ రోజు సరస్వతీ దేవికి పూజలు చేస్తే తమ చిన్నారులకు చదువు బాగా వస్తుందని భారతీయులకు నమ్మకం.అందులోనే భాగంగా మధనాపురం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో వసంత పంచమి వేడుకలు అంగరంగవైభవంగా జరుపుకున్నారు.వసంత పంచమి సందర్భంగా అంగన్వాడీ టీచర్ మమత,సర్పంచి జంగిడి విజయలక్ష్మితో కలిసి చిన్నారులు ఇయన్స్,రియన్స్ లకు అక్షరాభ్యాసం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి జంగిడి విజయలక్ష్మి శ్రీనివాస్,ఉప సర్పంచి ఆడెపు శేఖర్,వార్డు సబ్యులను శాలువలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం,సర్పంచి జంగిడి విజయలక్ష్మి శ్రీనివాస్,ఆడెపు శేఖర్,వార్డు సబ్యులు,ప్రాథమిక పాఠశాల ఉపాద్యాయుని,ఉపాధ్యాయులు వి.అరుణ,శ్రీరామ్, అంగన్వాడీ టీచర్ మమత,విఓఏ బేబీ,ఆశ పారిజాత,ఆయా మంజుల,చిన్నారుల తల్లులు రమాదేవి,విజయ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలు విద్యకు సోపానాలు

కోదాడ టౌన్, జనవరి 23 (ప్రజా జ్యోతి): కోదాడలోని కె.ఆర్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "మెగా పేరెంట్ టీచర్



మీటింగ్"(విద్యార్థుల తల్లిదండ్రులతో అధ్యాపకుల సమావేశం) ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు లెక్చరర్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి వేముల వెంకటేశ్వర్లు ప్రారంభ ఉపన్యాసం చేయగా, సభాధ్యక్షులుగా వ్యవహరించిన కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ రణబోతు పిచ్చిరెడ్డి మాట్లాడుతూ కళాశాల నివేదికను, విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా "ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్ సింగ్" పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోని విద్యను, వసతులను ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక వనరులను సద్వినియోగపరుచుకోవాలని ఆయన అన్నారు. పిల్లల భవిష్యత్తుపై వారి విద్య విధానంపై తల్లిదండ్రులు అధ్యాపకుల మధ్య అవగాహన ఎప్పుడూ ఉండాలని , పురోగతి సాధించాలని అన్నారు. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి సెల్ ఫోనుకు దూరంగా ఉండాలని, మంచి విషయాలకు మాత్రమే దానిని ఉపయోగించాలని, ఇంటర్ బోర్డు, ప్రభుత్వం కలసి ప్రతి కళాశాలకు అన్ని వసతులను సమకూర్చాయని అన్నారు. ముఖ్యంగా పాఠ్యపుస్తకాలు, ప్రాక్టికల్ మెటీరియల్, సీసీ కెమెరాలు, పాఠాల బోధనకు టీవీ ప్యానెల్స్, గేమ్స్ మెటీరియల్స్ను, భవనాల మరమ్మతులకు, ఎలక్ట్రికల్ పనులకు, నీటి వసతులకు కలిపి 20 లక్షలకు పైగా నిధులు ఇచ్చామని ఆయన అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసే దిశగా ఆలోచిస్తున్నామని ఆయన అన్నారు. అధ్యాపకులు తరగతి గదిలో విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, విద్యార్థులకు మంచి అలవాటులను నేర్పించాలని, అలాగే తల్లిదండ్రులు కూడా కళాశాలకు తరచుగా వస్తూ పాఠాల బోధన విధానాన్ని పరిశీలించాలని అన్నారు. కళాశాల, విద్యార్థి ఇల్లు రెండు



ఒకే దిశలో పనిచేసినప్పుడే విద్యార్థి మంచి ఫలితాలు సాధిస్తారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగాలు పొందినటు వంటి కె. ఆర్.ఆర్. కళాశాల పూర్వ విద్యార్థులను ఆహ్వానించి భీమ్ సింగ్ చేతుల మీదుగా వారిని సత్కరించడం జరిగింది. బోటనీ లెక్చరర్ యం.జానయ్య, ఫిజికల్ డైరెక్టర్ బి.శైలజ, ఏ.ఎన్.ఎం. కె.గాయత్రీలు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు పొందామని ,ఇక్కడ అన్ని వసతులు ఉండటం వలన మేము జీవితంలో స్థిరపడ్డామని, ఈ ప్రభుత్వ కళాశాలలను ఎప్పటికీ మర్చిపోలేనమని, కళాశాలకు రుణపడి ఉంటామని వారు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థినులు వేసిన రంగవల్లులు కళాశాలకు మరింత సౌందర్యాన్ని తీసుకువచ్చాయి. ఈ కార్యక్రమంలో వార్డెన్లు మమత, పద్మ, బాలకృష్ణలతో పాటుగా కళాశాల సిబ్బంది వి. బలభీమరావు, ఆర్.రమేష్,పి. రాజేష్,ఎం. రత్నకుమారి, బి. రమేష్ బాబు,జి. వెంకన్న, కె. రామరాజు, జి. రవి కిరణ్, కె.సతీష్, జి. నాగరాజు, పి. తిరుమల, ఎస్. గోపికృష్ణ, ఈ. నరసింహారెడ్డి, ఎస్.కె ముస్తఫా, జె.తిరుపతయ్య,, ఎస్. కే.ఆరీఫ్, కె. శాంతయ్య, ఎన్. జ్యోతిలక్ష్మి, ఆర్. చంద్రశేఖర్, ఎస్. వెంకటేశ్వర చారి, టి. మమత, డి.ఎస్.రావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు మొదలగు వారు పాల్గొన్నారు.

## ఘనంగా హుస్సేన్‌నగర్‌లో వసంత పంచమి వేడుకలు





**నిజామాబాద్ రూరల్: జనవరి, 23 (ప్రజాజ్యోతి)** సిరికొండ మండలం హుస్సేన్‌నగర్ గ్రామంలో కొలువైన శ్రీ మహా జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవాలయంలో వసంత పంచమి సందర్భంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించి వేద మంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు చేశారు. పసుపు వస్త్రాలు, పుష్పమాలలతో అమ్మవారిని సుందరంగా అలంకరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. వసంత పంచమి విశిష్టతను అర్చకులు తేజశ్రీ ప్రమోద్ భక్తులకు వివరించారు. ఈ రోజున సరస్వతి దేవిని భక్తితో ఆరాధిస్తే విద్యాబుద్ధులు, వాక్సిద్ధి, సృజనాత్మక శక్తి లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

### తహసీల్దార్ కార్యాలయం జెడ్‌పిహెచ్‌ఎస్
## సిరికొండలో జాతీయ ఓటర్ ఐడి దినోత్సవం






**నిజామాబాద్ రూరల్: జనవరి, 23 (ప్రజా జ్యోతి)** సిరికొండ మండల కేంద్రంలో గల జెడ్‌పిహెచ్‌ఎస్ సిరికొండలో శుక్రవారం జాతీయ ఓటర్ ఐడి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఆర్. రవీందర్ రావు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి కలిగిన విలువైన హక్కు అని, అదే ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటర్ జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ నమోదు ద్వారా మాత్రమే ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే అవకాశముంటుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలతో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. యువత బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకుంటే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని, దేశ భవిష్యత్తు దిశానిర్దేశంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొని జాతీయ ఓటర్ ఐడి దినోత్సవాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ గంగాధర్, కార్యాలయ సిబ్బంది, ప్రధాన ఉపాధ్యాయుడు సతీష్ గౌడ్, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, వి డి సి కమిటీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గడ్కోల్‌లో కారోబార్ నియామకం పాదర్శకంగా చేపట్టాలి
### - సీపీఐ (ఎంఎల్) నాయకుల డిమాండ్



**నిజామాబాద్ రూరల్: జనవరి, 23 (ప్రజా జ్యోతి)** సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో ఖాళీగా ఉన్న కారోబార్ పోస్టును నోటిఫికేషన్ జారీ చేసి అర్హులను నియమించాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ గడ్కోల్ గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు శుక్రవారం ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ గ్రామ కార్యదర్శి ఎం. లింబాద్రి మాట్లాడుతూ గడ్కోల్ గ్రామంలో కారోబార్‌గా పనిచేసిన కాసుల సాయన్న రాజీనామా చేయడంతో పోస్టు ఖాళీ అయిందన్నారు. అయితే ప్రస్తుత పాలక వర్గం నోటిఫికేషన్ ఇవ్వకుండా లోలోపల తమకు అనుకూలమైన వ్యక్తిని నియమించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం ఉందని, ఇది పూర్తిగా తప్పని విమర్శించారు. కారోబార్ నియామకం విషయంలో నోటీసు జారీ చేసి, గ్రామంలో చాటింపు చేయించి పాదర్శకంగా నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామంలో అనేక మంది విద్యవంతులు, అర్హులైన వ్యక్తులు ఉండగా, నచ్చిన వ్యక్తినే నియమించాలనే ప్రయత్నం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. గుట్టుచప్పుడు కాకుండా చేపడుతున్న లోపాయికర నియామకాలు గ్రామ ప్రజలందరికీ స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా పాలక వర్గం స్పందించి గడ్కోల్ గ్రామంలో కారోబార్ నియామకాన్ని న్యాయసమ్మతంగా, పాదర్శకంగా చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ గడ్కోల్ గ్రామ కమిటీ నాయకులు బి. కిశోర్, ఎం. అనిస్, ఎస్. కిశోర్, జి. కిరణ్, పి. ఎల్లయ్య, ఎస్‌కే. రఫిక్, జి. రాజు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ యూనివర్శిటీలో
## ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు



**నిజామాబాద్ రూరల్: జనవరి, 23 (ప్రజా జ్యోతి)** తెలంగాణ విశ్వవిద్యాలయంలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్--1, 4ల ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణమని, ముఖ్యంగా యువత తమ బాధ్యతను గుర్తించి తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువ ఓటర్ల పాత్ర కీలకమని తెలిపారు. సదస్సులో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ స్వప్న, డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ, ఓటు విలువ, ఓటరు బాధ్యతలపై వాలంటీర్లకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా వాలంటీర్లు ఓటర్ ప్రాముఖ్యతతో పాటు దేశ అభివృద్ధిలో ఓటు పాత్రను అవగాహన చేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లతో ఓటర్స్ డే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### సరస్వతి విగ్రహానికి పూజలు
## నిర్వహించిన ఆజాద్ హిందు యూత్ అసోసియేషన్



**సదాశివనగర్ జనవరి 23 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆజాద్ హిందూ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతీ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ హింద్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. గత పూర్వ విద్యార్థులైన ఆజాద్ యూత్ సభ్యులందరూ కలిసి ఇంతకుముందు విగ్రహం ఏర్పాటు చేశారు. కావున ప్రతి సంవత్సరం వసంత పంచమి రోజు సరస్వతి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆజాద్ హిందూ యూత్ సభ్యులు మాజీ ఉప సర్పంచ్ శివ పటేల్, శ్రీధర్, సుధాకర్, ప్రవీణ్, ఎ. ప్రవీణ్, వెంకట్రావు, రాజశేఖర్, రాజేందర్, రమేష్ మరియు హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం
### - ఇక ఆధార్ అప్‌డేట్లకు కామారెడ్డి పరుగులు అవసరం లేదు




**రాజంపేట జనవరి 23 (ప్రజా జ్యోతి)** రాజంపేట మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని శుక్రవారం తహశీల్దార్ కె. జానకీ, గ్రామ సర్పంచ్ దుబ్బని శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతనంగా ప్రారంభమైన ఆధార్ కేంద్రం వల్ల మండల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మండలం ఏర్పడి చాలాకాలమైనప్పటికీ, మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం, వివిధ ప్రభుత్వ శాఖలు, మీ–సేవ కేంద్రం ఉన్నా ఇప్పటివరకు ఆధార్ సేవా కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఆధార్ నమోదు, అప్‌డేట్ పనుల కోసం ప్రజలు కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, దీంతో సమయం, డబ్బు వృథా కావడమే కాకుండా ఇబ్బందులు ఎదురయ్యేవని పేర్కొన్నారు. ప్రత్యేకంగా చిన్నారుల బాల ఆధార్ కార్డులు ఐదేళ్ల అనంతరం తప్పనిసరిగా అప్‌డేట్ చేయాల్సి ఉండటంతో, పిల్లలను దూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మహిళలు, వృద్ధులు, పేద ప్రజలు ప్రయాణాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని. ఇప్పుడు మండల కేంద్రంలోనే ఆధార్ సేవలు అందుబాటులోకి రావడం హర్షణీయమని గ్రామ ప్రజలు అభిప్రాయపడ్డారు. ఈ ఆధార్ సేవా కేంద్రం ద్వారా నూతన ఆధార్ నమోదు, చిరునామా మార్పు, మొబైల్ నంబర్ అప్‌డేట్, బాల ఆధార్ అప్‌డేట్లు వంటి సేవలు స్థానికంగానే అందనున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు ఇతర మండలాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సులభంగా సేవలు పొందవచ్చని అధికారులు వెల్లడించారు. మండల ప్రజలు ఈ ఆధార్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె. జానకీ, సర్పంచ్ దుబ్బని శ్రీకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్ద వాల్గోట్‌లో ఘనంగా నేతాజీ జయంతి



**నిజామాబాద్ రూరల్: జనవరి 23 (ప్రజా జ్యోతి)** సిరికొండ మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పిట్ల వనిత--నర్సింగ్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు పోరాడిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి నిలబడి దేశానికి స్వేచ్ఛ సాధించేందుకు ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. నేతాజీ చూపిన దేశభక్తి, త్యాగభావం యువతకు ఆదర్శమని, ఆయన అడుగుజాడల్లో నడుచుకుంటూ దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి రాజు, జీపీఓ నవీన్, ప్రజాప్రతినిధులు నర్సారెడ్డి, రామిరెడ్డి, యువకులు శ్రీకాంత్ గౌడ్, జగదీష్ గౌడ్, కార్తీక్, ప్రసాద్ గౌడ్, గంగాధర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించి, దేశ సేవకు అంకితమవుతామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇచ్చిన హామీని నెరవేర్చిన దొడ్లే రవి



**సదాశివనగర్ జనవరి 23 (ప్రజాజ్యోతి)** రాజకీయాల్లో గెలుపు--ఓటములు సహజమే అయినా, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం చాలా అరుదుగా కనిపిస్తోంది. సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామానికి చెందిన దొడ్లే రవి మాత్రం ఇందుకు భిన్నంగా నిలిచారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని, ముదిరాజ్ సంఘం, పెద్దమ్మ గుడికి బోరు వేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చిన దొడ్లే రవి, స్వల్ప మెజారిటీతో ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ తన మాటకు కట్టుబడి ఆ హామీని నెరవేర్చారు. ఎన్నికల్లో విజయం సాధించకపోయినా, ప్రజలపై ఉన్న బాధ్యతను మర్చిపోకుండా, ఇచ్చిన మాటను గౌరవిస్తూ పెద్దమ్మ గుడి వద్ద బోరు వేయించే పనులను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను అభినందించారు. రాజకీయాల్లో ఓడిపోయిన తర్వాత హామీలను విస్మరించే నాయకులు ఎక్కువగా కనిపిస్తున్న ఈ రోజుల్లో, ఆయన చేసిన ఈ చర్య ప్రశంసనీయం అని పలువురు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం పదవులు అవసరం లేదని, మనసుంటే సేవ చేయవచ్చని ఆయన మరోసారి నిరూపించారని గ్రామ పెద్దలు అన్నారు. ముఖ్యంగా దేవాలయ అవసరాల కోసం తీసుకున్న ఈ నిర్ణయం భక్తుల్లో ఆనందాన్ని నింపిందని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, గెలుపు--ఓటములకు అతీతంగా ప్రజల మన్ననలు పొందిన ఆయన, యువతకు మరియు రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచారని గ్రామస్తులు తెలిపారు.

## జాతీయ ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ




**కామారెడ్డి ప్రతినిధి జనవరి 23. (ప్రజాజ్యోతి)** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ , అదనపు కలెక్టర్లు విక్టర్ , మధుమోహన్ పాల్గొని జిల్లా అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

**ఓటరు ప్రతిజ్ఞ:**

భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల పవిత్రతను నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగిస్తామని ఇందు మూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొందుర్తి సర్పంచ్‌కు ఘన సన్మానం



**రాజంపేట జనవరి 23 (ప్రజా జ్యోతి)** సీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో రాజంపేట మండలం పొందుర్తి గ్రామ సర్పంచ్ గర్గుల బాబును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రజాప్రతినిధులు పనిచేయాలని సూచించారు. ప్రజలిచ్చిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా పదవులకు న్యాయం చేయాలని, గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి నిరంతరం సేవ చేయడం ప్రజాప్రతినిధుల ప్రధాన కర్తవ్యమన్నారు. గ్రామాభివృద్ధి కోసం అవసరమైన నిధులు తీసుకొచ్చే బాధ్యతను తాను భుజాన వేసుకుంటానని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా గ్రామాలకు మరిన్ని అభివృద్ధి పనులు తీసుకువచ్చేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రజలు సేవ చేసే అవకాశం కల్పించినందుకు గ్రామ ప్రజలకు రుణపడి ఉండాలన్నారు. అనంతరం సర్పంచ్ గర్గుల బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాదవ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు కృష్ణారావు పాల్గొన్నారు.

### ఘనంగా సిరికొండలో
## నేతాజీ జయంతి వేడుకలు



**నిజామాబాద్ రూరల్: జనవరి, 23 (ప్రజాజ్యోతి)** సిరికొండ మండల కేంద్రంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కమిటీ అధ్యక్షుడు అవధూత గంగాధర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరంలో అగ్రగన్యుడిగా నిలిచిన నేతాజీ అలుపెరుగని పోరాటయోధుడని, ఓటమి ఎరుగని ధైర్యంతో బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మహానాయకుడని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ కమిటీ సభ్యులు పాల్గొని నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఎన్నికల హామీని నెరవేరుస్తున్న సర్పంచ్
### - పింఛన్ దారులకు అల్పాహారం అందజేత



**నాగిరెడ్డిపేట్, జనవరి23(ప్రజాజ్యోతి):** నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ గ్రామంలో స్థానిక ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చిన హామీతో గెలిచిన సర్పంచ్ ఆచరణలో ముందుకు వెళ్లారు. గ్రామా సర్పంచ్ భూమా యాదాగౌడ్ ప్రతినెలా పింఛన్ దారులకు అల్పాహారం అందజేస్తానని హామీ మేరకు గత నెలలో అల్పాహారం ఏర్పాటు చేసారు. దాంట్లో భాగంగా శుక్రవారం గ్రామంలోని పింఛన్ దారులకు అల్పాహారం అందజేసినట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా హామీని నెరవేరుస్తున్న సర్పంచిపై పింఛన్ దారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### ఫిట్నెస్‌లేని స్కూల్ బస్సులు,
## వ్యాన్లు తక్షణమే సీజ్ చేయాలి
### మావురం శ్రీకాంత్, బాలరాజు



**బాన్సువాడ ఆర్‌సీ జనవరి 23 (ప్రజా జ్యోతి)** బోధన్ పట్టణం డివిజన్ పరిధిలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫిట్నెస్ లేకుండా నడుస్తున్న స్కూల్ బస్సులు, వ్యాన్లను తక్షణమే సీజ్ చేయాలని పీడీఎస్‌యూ(ఎస్) జిల్లా అధ్యక్షుడు ఎన్. బాల్‌రాజ్, టీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మావురం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బోధన్ ఆర్టీవో కార్యాలయంలో ఆర్టీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుస్తున్న వాహనాల వల్ల విద్యార్థుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం నాడు శ్రీ సాయి ప్రసన్న హైస్కూల్‌కు చెందిన వ్యాన్ అదుపు తప్పి రోడ్డుపై నుంచి కాలువలోకి దూసుకెళ్లిన ఘటనను వారు ఉదాహరణగా పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు బోధన్ ప్రాంతంలో గతంలోనూ ఎన్నోసార్లు పునరావృతమయ్యాయని తెలిపారు. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల భద్రతను పూర్తిగా విస్మరించి, కేవలం ఫీజులపైనే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశముందని హెచ్చరించారు. అందువల్ల ఆర్టీవో అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులు, వ్యాన్లను సీజ్ చేసి, విద్యార్థుల భద్రతను కాపాడాలని వారు కోరారు.

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

– కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి – బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన బండారు రమేష్ గౌడ్





**తొగుట, జనవరి 23(ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి నాయకులకు సూచించారు. తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్ ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత చెడుకు దూరం ఉంటూ మంచి నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగాలని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా పాలనలో అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి గడపకు వెళ్ళి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న కార్యక్రమాలను తెలియజేయాలన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలు గాని, ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగిరేలాగా యువత కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో అరిగోస పడ్డాం గత పది సంవత్సరాల బీఆర్ఎస్ అరాచక పాలనలో అరిగోస పడుతూ చాలా బాధ పడ్డామని కాంగ్రెస్ పార్టీ లో చేరిన బీఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు బండారు రమేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం నాకు జన్మించిన అమ్మ లాంటి పార్టీలో చేరినట్లుగా ఎంతో సంతోషంగా ఉందని, తన అభిమాన నాయకులు స్వర్గీయ మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి ఆశయ సాధనకై అనునిత్యం ప్రజల్లో ఉంటున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన వారిలో ఏంఆర్పిఎస్ గ్రామ అధ్యక్షులు ఏరోళ్ళ అర్జున్, మిద్దె స్వామి, వడ్డే నర్సింలు, సిరిసిల్ల రవీందర్, మన్నే స్వామి, వడ్డే మురళీ, ఇదుగొల్ల మల్లేశం, పుల్లనోల్ల శ్రీకాంత్, వడ్డే నాగరాజు, ఇదుగొల్ల రాజు, కలేపు భాస్కర్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంగరీ నర్సింలు, సర్పంచ్ లు రమేష్, రవీందర్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు సంతోష్, ప్రవీణ్, బెజ్జనబోయిన రాములు, సయ్యద్ అన్సర్, చందా సత్తయ్య, సీనియర్ నాయకులు పంది రాజు, మహిపాల్ రెడ్డి, శ్రీనకర్ రెడ్డి, మల్లారెడ్డి, పోచయ్య, భారత్ తేజ, వెంకటేశం, అంజనేయులు, కృష్ణ, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

## పార్కింగ్‌లో మురికి నీరు

– భక్తులకు తప్పని ఇబ్బందులు
– కంపు కొడుతున్న దుర్వాసన
– పట్టించుకోని అధికారులు



**కొమురవెల్లి, జనవరి 23 (ప్రజా జ్యోతి):–** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం తోట బావి సమీపంలోని భక్తుల పార్కింగ్ ప్రదేశం మురికి నీటితో నిండిపోయింది. ఆలయ పరిసరాల్లో నివసిస్తున్న ఇళ్ల నుంచి, భక్తులు బస చేస్తున్న అద్దె గదుల నుంచి వచ్చే డ్రైనేజీ మురికి నీరు నేరుగా పార్కింగ్ స్థలంలోకి చేరుతుండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. భక్తుల వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన ఈ ప్రదేశంలో మురికి నీరు పేరుకుపోవడంతో వాహనాలు నిలపలేని పరిస్థితి నెలకొంది. ఆలయానికి వచ్చే భక్తులు అటువైపు వెళ్లాలన్నా తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. చుట్టుపక్కల నివసిస్తున్న స్థానికులు కూడా మురికి నీటి దుర్వాసనతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మురికి నీరు నిలిచిపోయిన ప్రాంతంలో పందులు సంచరిస్తూ పరిస్థితిని మరింత దారుణంగా మారుస్తున్నాయి.

గత పది రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా ఆలయ అధికారులు గానీ, సిబ్బంది గానీ పట్టించుకున్న పాపాన పోలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ ప్రదేశం వైపు చూసుకుంటూ వెళ్లడం తప్ప, మురికి నీటిని తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పార్కింగ్ స్థలం మొత్తం మురికి నీటితో నిండిపోవడంతో వాహనాలు నిలపాలన్నా, అక్కడ బస చేయాలన్నా భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాగే మురికి నీరు నిలిచివుంటే మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, పార్కింగ్ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని భక్తులు, స్థానికులు జిల్లా అధికారులను కోరుతున్నారు. భక్తుల సౌకర్యాన్ని విస్మరించి ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే ఆలయ ప్రతిష్ఠకే మచ్చ పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### జీపీఓ అందుబాటులో
## ఉండడం లేదని గ్రామస్తులు ఆగ్రహం



**నంగునూరు జనవరి 23(ప్రజా జ్యోతి):–**జి పి ఓ అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో సర్పంచ్ పోతర బోయిన ఓజయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలను తీసుకోవడంతో పాటు పలు అభివృద్ధి పనుల పై గ్రామ సభలో తీర్మానం చేయడం జరిగింది. గ్రామ సభ ఉందని తెలిసినప్పటికీ జిపిఓ మమత ఎందుకు గ్రామ సభకు హాజరు కాలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు గ్రామంలో రెసిడెన్సీ సర్టిఫికెట్ తో పాటు వివిధ సర్టిఫికెట్ల కోసం జిపిఓ కోసం వేచి చూడవలసి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ గ్రామసభ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి పాలమాకుల జిపిఓ గ్రామస్తులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇట్టి విషయంపై తాసిల్దార్ ను వివరణ కోరగా జిపిఓ తో మాట్లాడి గ్రామంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.



### వసంత పంచమి
## పూజలు ఉపాధ్యాయులకు సన్మానం





**నంగునూరు,జనవరి 23(ప్రజా జ్యోతి):–** వసంత పంచమి పండుగను పురస్కరించుకొని నంగునూరు మండలంలోని మగ్దూంపూర్ లో ఘనంగా నిర్వహించారు. ఉన్నత పాఠశాలలోని సరస్వతి విగ్రహానికి పాఠశాల తెలుగు పండితులు ఆదిరాల సాయినాథ శర్మ వైదిక నిర్వహణలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అభిషేకం అనంతరం విద్యార్థులకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మాజీ ఛైర్మన్ గంగరబోయిన అనురాధ, రవి దంపతుల సహకారంతో పులిహోర, పాయసం అందించారు. విద్యార్థులకు పెన్నులు అందించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను జిల్లా బీజేపీ నాయకుడు వాసర యాదమల్లు సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను సన్మానించుకోవడం గొప్ప గౌరవం అని నాయకులు యాదమల్లు అన్నారు. సన్మానంతో తమ బాధ్యత మరింత పెరిగిందని ఉన్నత పాఠశాల ఇంఛార్జి ప్రధానో పాధ్యాయుడు జీడిపల్లి సురేందర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారు ప్రసాద రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, దుద్దెడ పరశు రాములు, భైరు సత్తయ్య, దీకొండ గోవర్ధన్, అదిరాల సాయినాథ శర్మ, ముస్లి రాజయ్య, తడకంటి రాజు,కల్లూరి నర్సింలు, విజయలక్ష్మి, లీల, పూజ, సుమలత, పంచాయతీ కార్యదర్శి దర్శి కృష్ణవేణి, అంగన్వాడీ టీచర్లు పద్మ, ఆయా చందన, గ్రామ సర్పంచ్ పాకాల శ్రీనివాస్, నాయకులు బట్ట బాలరత్నం, శేరి సురేందర్ రెడ్డి, మాయోజు చక్రపాణి, అచ్చిన మల్లయ్య, జెల్ల పోచయ్య, తాటికొండ రాజు, అమ్మ ఆదర్శ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ పాకాల యాదమ్మ, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు పలారపు పరమేశ్వర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటరు ప్రతిజ్ఞ చేశారు. వసంత పంచమి పురస్కరించుకొని నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు సర్పంచ్ సంగు పురేందర్, ఉప సర్పంచ్ చిలుకల తిరుపతిరెడ్డి తదితరులు విద్యార్థులకు పలుకలను పంపిణీ చేసి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కత్తుల భవాని, కాచగోని లావణ్య, నాయకులు చిలకల పెద్ద తిరుపతిరెడ్డి, బెదురు నరసింహులు పాల్గొన్నారు.

## రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం: పలువురికి గాయాలు



**ములుగు,జనవరి 23 (ప్రజా జ్యోతి)** ములుగు మండలం చిన్న తిమ్మాపూర్ డబుల్ బెడ్ రూమ్ సమీపంలోని రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం వర్గల్ మండల కేంద్రంలోని శ్రీ శంబగిరి కొండలపై వెలిసిన శ్రీ విద్యా సరస్వతి మాత జన్మదినమైన శ్రీ పంచమి(వసంత పంచమి)ఉత్సవాన్ని నిర్వహిస్తుండడంతో భక్తులు వారి వారి సొంత వాహనాలలో వస్తున్న క్రమంలో వంటి మామిడి రాజీవ్ రాదారిపై వస్తుండగా ఒకదాని వెనకాల ఒకటి రావడం సడన్ బ్రేకు వేయడంతో ఐదు వాహనాలు గుద్దుకోగా వాహనాలలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. ఉద్యానవన విశ్వవిద్యాలయం సమీపంలో రాజీవ్ రహదారిపై వెనకాల నుండి ఒక వాహనానికి ఇంకొక వాహనం ఢీకొనడంతో వాహనాలలో ప్రయాణిస్తున్న వారికి గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

## విద్యార్థినికి అండగా రాజేశ్వర్ రెడ్డి



**చిన్నకోడూరు, జనవరి23,(ప్రజా జ్యోతి):–**పేదింటి చదువుల తల్లికి వంగ రాజేశ్వర్ రెడ్డి అండగా నిలిచారు. అల్లిపూర్ గ్రామానికి చెందిన పిండి మల్లేశం కూతురు వినీత బిఎస్సి నర్సింగ్ చదువుతుంది. వినీత చదువు కోసం వసంత పంచమి సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి తన వంతు సహాయంగా విద్యార్థినికి15000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమాజాభివృద్ధికి చదువే ప్రధాన ఆయుధమని, చదువుకు ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చే శక్తి ఉంది అన్నారు. చదువు విషయంలో ఏ విద్యార్థి ఆర్థికంగా ఇబ్బంది పడి చదువును మధ్యలో వదలకూడదనే సంకల్పంతో ఇలాంటి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అమ్మాయే కుటుంబాన్ని, సమాజాన్ని ముందుకు నడిపించగల శక్తి కలిగి ఉన్నదని అలాంటి బాలికల చదువు కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కుంభాల చంద్రశేఖర్, గ్రామ వార్డు మెంబర్లు రాజు,మూర్తి, విఆరర్ అల్లిపూర్ గ్రామ సైన్యం తదితరులున్నారు.

### ప్రాథమిక
## పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

**ములుగు, జనవరి23,(ప్రజా జ్యోతి):–**ములుగు, జనవరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నపిల్లలకు సంబంధించిన గ్రంథాలయాన్ని రూం టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ గ్రంథాలయంలో పిల్లల స్థాయి కనుగుణంగా 600 పుస్తకాలు,టేబుళ్లు,చాపలు,బీరువాలు,రిజిస్టర్లు అందించారని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ గ్రంథాలయంలో కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నందున పాటిని చదివిస్తూ ప్రతి పిల్లవాడికి చదివే విధానాన్ని నేర్పిస్తూ చదివించాలని,చదవడం అలవాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవికుమార్,రూమ్ టూర్ రేడు కోఆర్డినేటర్ పల్లె వెంకన్న ఉపసర్పంచ్ రమేష్,వార్డు సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలల
## మెగా పేరెంట్, టీచర్ సమావేశం






**ములుగు,జనవరి 23 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రమైన ములుగు ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశం కళాశాల ప్రిన్సిపల్ శశికళ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో జరిగిన మార్పులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు. ఈ కళాశాలలో గతంలో చదువుకొని ఉన్నత స్థితిలో ఉన్న విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేసినందుకు కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కృష్ణాపూర్ సర్పంచ్ శశికళ తుకారం
## అంగన్వాడి విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



**కల్హే ర్. 23. జనవరి ప్రజాజ్యోతి** సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన కల్హేర్ లోని కృష్ణాపూర్ గ్రామంలో వసంత పంచమి పురస్కరించుకొని శశికళ తుకారం మరియు. ఉప సర్పంచ్ దస్తవ్వ( లక్ష్మి) రమేష్ ఆధ్వర్యంలో అంగన్ వాడి స్కూల్. లక్ష్మి ), మరియు అంగన్ వాడి స్కూల్ మానెమ్మ )గారీ పాఠశాలలో పిల్లలకు యూనిఫామ్స్ పంపిని చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న కార్యకర్తలు అరవింద్. విట్టల్,సాయిలు, శ్రీనివాస్, ప్రవీన్, అరవింద్, నారాయణ, వెంకయ్య, గుల బాలయ్య, వెంకటేశం, మహేందర్ ఇతర నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ట్రాఫిక్ నిబంధన పాటిద్దాం.. మన ప్రాణాలకు రక్షణ చేసుకుందాం..

– రోడ్డు భద్రత అవగాహన సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ రెడ్డి










**నారాయణఖేడ్ జనవరి 23 (ప్రజా జ్యోతి)** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని మా ఫంక్షన్ లో సంగారెడ్డి జిల్లా పోలీసులు నారాయణఖేడ్ పట్టణంలో నిర్వహించిన రోడ్డు సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం కు ముఖ్యఅతిథిగ నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, సంగారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ రఘునందన్ రావు , నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ మా హారతి ముఖ్యమైన అధికారులు పాల్గొన్నారు. ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి మాట్లాడుతూ...,. ట్రాఫిక్ నిబంధన పాటిద్దాం మన ప్రాణాలకు రక్షణ చేసుకుందాం అని రోడ్డు భద్రత అవగాహన సదస్సు వల్లనైన ఇప్పటి నుండి ఆయన ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ మనమందరం ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని, ప్రమాదాలకు మూల కారణం వేగమము, డ్రంక్ అండ్ డ్రైవ్, చిన్నపిల్లలకు బండ్లు ఇవ్వడం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని దీన్ని నివారణిస్తే ప్రమాదాలు తగ్గుముఖం పడతాయనితెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే మన ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారూతాయాని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వాడటం, ఓవర్ స్పీడ్ నివారించడం, మొబైల్ ఫోన్ ఉపయోగం ఆపడం వంటి సాధారణ నియమాలు పాటిస్తే చాలామంది జీవితాలు కాపాడుకోవచ్చు అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ట్రాఫిక్ నియమాలు పాటించి అందరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని అరైవ్ అలైవ్ – 2026 అభియాన్ లక్ష్యంగా అందరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలన్నారు. పోలీస్ శాఖను అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా ఎక్కువ నిర్వహించాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ఈ రకమైన అవగాహన కార్యక్రమాలతో ప్రమాదాలను తగ్గించేందుకు ప్రయత్నంలో ముందుండాలని కోరారు. ముఖ్యంగా యువకులు చాలా మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నరని, యువకులు మద్యం తాగి వాహనాలు నడపడం మరియు ప్రతి ఒక్కరూ 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు లైసెన్స్ ఉన్న వారికి మాత్రమే వాహనాలు నడపాలని, దీనికి బాధ్యత వహించాల్సింది యువత తల్లిదండ్రులని తెలిపారు. వారు కూడా వారి పిల్లలకు ఇవ్వకుండా వారిని నచ్చా చెప్పాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎవ్వరకూడ మద్యం తాగి మరియు లైసెన్స్ లేని డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి మీ ప్రాణాలకు మరియు ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా చూసుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని, వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి , కంగ్టి సీఐ వెంకటరెడ్డి , నారాయణఖేడ్ సిఐ శ్రీనివాస్ రెడ్డి , నారాయణఖేడ్ ఎమ్మార్వో, వివిధ ఉన్నత అధికారులు మరియు నియోజకవర్గంలోని సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ యంత్రాంగం, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజలు నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







## హోరాహోరీగా సీఎం కప్ క్రీడా పోటీలు





**వికారాబాద్ ప్రతినిధి, జనవరి 23(ప్రజా జ్యోతి):** రెండో విడత సీఎం కప్––2025 క్రీడా పోటీల్లో భాగంగా వికారాబాద్ జిల్లాలో శుక్రవారం నాలుగు క్లస్టర్లలో పోటీలు ప్రారంభమయ్యాయి. పూడూరు, మన్నెగూడ, గోధంగూడ, శివారెడ్డిపేట క్లస్టర్ల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఈ పోటీలు నిర్వహించారు. ఆన్?లైన్?లో నమోదు చేసుకున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కోకో, కబడ్డీ విభాగాల్లో బాలురు, బాలికల మధ్య పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా క్రీడా యువజన సంక్షేమ అధికారి అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ, "మత్తు వదిలి మైదానాలకు కదలండి" అనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వికారాబాద్ జిల్లా నుంచి దాదాపు 8 వేల మంది క్రీడాకారులు నమోదు చేసుకున్నారని చెప్పారు. రేపు మరిన్ని క్లస్టర్లలో పోటీలు జరుగుతాయని, జనవరి 27, 28 తేదీల్లో క్లస్టర్ స్థాయి పోటీలు పూర్తిచేసి, 30, 31 తేదీల్లో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని వివరించారు. జిల్లా కలెక్టర్ సహకారంతో, వివిధ శాఖల సమన్వయంతో పోటీలు విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు కన్నం మధు, పీఆర్?వో కాలేరు సురేష్, రాజేష్, పీఈటీ నరసింహులు, పలు జడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ స్మైల్‌లో నూట ఆరు మంది పిల్లల రక్షణ

- చదువుకోవాల్సిన వయసులో పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు
- వికారాబాద్ జిల్లా పోలీసు అధికారి స్నేహ మెహ్రా



**వికారాబాద్ ప్రతినిధి,జనవరి 23(ప్రజాజ్యోతి):** వికారాబాద్ జిల్లాలో బాలల రక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు నూట ఆరు మంది పిల్లలను రక్షించినట్లు జిల్లా పోలీసు అధికారి స్నేహ మెహ్రా తెలిపారు. రక్షించబడిన వారిలో తొంభై మంది బాలురు, పదహారు మంది బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటుక బట్టీలు, బేకరీలు, హోటళ్లు తదితర వాణిజ్య ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించి బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాలకు చెందిన పిల్లలను కూడా గుర్తించి, వారి తల్లిదండ్రులకు లేదా సంరక్షణ కేంద్రాలకు చేర్చే చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. చదువుకోవాల్సిన వయసులో పిల్లలతో పని చేయించడం చట్ట విరుద్ధమని, నిబంధనలు అతిక్రమించిన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటూ ఇప్పటివరకు ఇరవై మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసు శాఖకు లేదా బాలల సహాయ కేంద్రానికి సమాచారం అందించాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు.

## ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు ఓటు

– పరిగి తహసిల్దార్ వెంకటేశ్వరి



**పరిగి, జనవరి 23 (ప్రజాజ్యోతి) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుధమని, 18 సంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పరిగి తహసిల్దార్ వెంకటేశ్వరి పిలుపునిచ్చారు. 16వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పరిగి తహసిల్దార్ కార్యాలయంలో, మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల పరిగి లో, అలాగే జడ్పీహెచ?స్ నెంబర్––1 పరిగి పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, భవిష్యత్తు ఓటర్లతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. "నా భారతదేశం–నా ఓటు", "భారతీయ ప్రజాస్వామ్యానికి పౌరుడే కీలకం" అనే నినాదాలతో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ప్రజాస్వామ్యంలో పంచాయతీ స్థాయి నుంచి రాష్ట్రపతి వరకు ఎన్నికలు ఓటు ద్వారానే సాధ్యమవుతాయని, అందుకే ప్రతి పౌరుడు ఓటు విలువను గుర్తించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య, డిప్యూటీ తహసిల్దార్ విజయేందర్, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, ఆర్ఐ దివ్య, గ్రామ పాలన అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి





జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ ప్రతినిధి, జనవరి 23 (ప్రజా జ్యోతి) :** జిల్లాలోని కోడంగల్, తాండూర్, పరిగి, వికారాబాద్ మున్సిపాలిటీల్లో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మేడ్చల్––మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్?కు వివరించారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను మ్యాపింగ్ చేసి ప్రచురించడం జరిగిందని, వాటి వివరాలను ఇప్పటికే టీ––పోల్ యాప్?లో నమోదు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలను ఒక దశలో పరిశీలించామని, ఆర్.ఓ ఏఆర్.ఓ.లను గుర్తించామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉన్నారని, బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్?కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన భవనాలను కూడా పరిశీలించినట్లుపేర్కొన్నారు. జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్–ఎస్.టి బృందాలకు మేజిస్ట్రియల్ అధికారాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్?లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, తాండూర్, పరిగి, కోడంగల్, వికారాబాద్ మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అందరూ సహకరించాలి







- వేగం కంటే ప్రాణం మిన్న అనే సూచనలు పాటించాలి
- తాండూరులో రోడ్డు భద్రత మాసోత్సవాలు
- ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షితమైన ప్రయాణం చేయండి
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**తాండూరు జనవరి 23 (ప్రజా జ్యోతి) :** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా వాహనదారులు, ప్రజలకు సూచించారు. శుక్రవారం రోజు తాండూరు పట్టణ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో 'అలైవ్ అరైవ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఇందిర చౌక్ నుండి ఆర్య వైశ్య కళ్యాణ మంటపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సదస్సులో జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలతో అనే ఘటనలు చోటు చేసుకుంటాయని చెప్పారు. ఓ వ్యక్తి ప్రాణం పోవడమె కాకుండా, ఆ కుటుంబం మొత్తాన్ని కూడ రోడ్డున పడేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కుటుంబ పెద్దను కోల్పోయిన ఇళ్లు ఆర్థికంగా, సామాజికంగా చితికిపోతాయని తెలియజేశారు. జిల్లా పోలీస్ శాఖ తరపున 2026 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలను కనిష్ట స్థాయికి తగ్గించడమే లక్ష్యంగా వేగం కంటే ప్రాణం మిన్న' అనే అంశంతో జిల్లా వ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టామని ఎస్పీ చెప్పారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం,ఇతర వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి ప్రాథమిక నియమాలను విస్మరించకూడదని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలను భయంతో కాకుండా బాధ్యతగా భావించాలని సూచించారు. అదేవిధంగా సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటివి ప్రాణాంతకమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి,తాండూర్ డి?ఎస్?పి ఎన్.నర్సింగ్ యాదయ్య, రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్‌తో ఆడపడుచుల ఇండ్లలో ఆనందం





- రూ 1కోటి 8 లక్షల12 వేల 528 రూపాయల చెక్కుల పంపిణి
- తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**తాండూరు జనవరి 23 ప్రజా జ్యోతి :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం రోజు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చెక్కుల పంపిణీ, రైతులకు వ్యవసాయ సబ్సిడీపై మంజూరైనా పరికరాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తాండూరు నియోజకవ ర్గంలోని పలు మండలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశామని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా 108 మంది అర్హులైన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు రూ కోటి 8 లక్షల 12 వేల 528 రూపాయల నగదు చెక్కులను అందజేశామని చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు పేదలకు అందించడం కోసం ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అదేవిధంగా ఎన్నడు లేని విధంగా వ్యవసాయదారులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికె సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ రవి గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దార సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి రజరత్నం, తాండూరు ఇన్చార్జ్ ఏ డి ఏ కొమరయ్య, వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అక్షరాభ్యాసాలు చేయించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్





**శేరిలింగంపల్లి, జనవరి 23 (ప్రజాజ్యోతి) :** శేరిలింగంపల్లి డివిజన్‌లోగల తారానగర్‌లోని సన్ షైన్ గ్లోబల్ స్కూల్ చైర్మెన్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వసంత పంచమి మహోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సరస్వతీ పూజలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం తన ఒడిలో చిన్నారిని కూర్చోబెట్టుకుని చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. చదువుల తల్లి జ్ఞాన స్వరూపిణి శ్రీ సరస్వతి దేవి కరుణకటాక్షాలతో ప్రతిఒక్కరూ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధికా, పురం విష్ణువర్ధన్ రెడ్డి,సన్ షైన్ స్కూల్ టీచర్స్ చిన్మయి, ఉషా, వాణి, సరిత, రాధికా, నీరజ, రమాదేవి విద్యార్థులు వారి తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

– జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ ప్రతినిధి, జనవరి 23(ప్రజా జ్యోతి) :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, 18 సంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, ఉద్యోగులతో కలిసి ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా, నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ నుండి రాష్ట్రపతి వరకు ప్రజాప్రతినిధుల ఎన్నిక ఓటు ద్వారానే సాధ్యమవుతుందని, ఓటు విలువను ప్రతి పౌరుడు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వరి, సుదీర్, డీఆర్?ఓ మంగిలాల్, జిల్లా స్వీప్ అధికారి సత్తార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్ అలీతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




## అమ్మవారి దయ, కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలి



గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**శేరిలింగంపల్లి,జనవరి 23 (ప్రజాజ్యోతి) :** శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ, పోచమ్మ ,పెద్దమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన తృతీయ వార్షిక కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఇంద్ర నగర్‌లో శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ తల్లి ఆలయంలో నిర్వ హించిన తృతీయ వార్షిక కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ... గచ్చిబౌలి డివిజన్ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని ప్రజలు సుఖ సంతోషా లతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నానని తెలిపారు. గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలలో భాగమని అన్ని అన్నారు.అమ్మవారి ఆలయ తృతీయ వార్షికోత్సవం లో పాల్గొనడం అదృష్టకరం అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు..ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ, పోచమ్మ ,పెద్దమ్మ తల్లి ఆలయం ప్రధాన కార్యదర్శి తోట్ల జైహింద్, ఉపాధ్యక్షులు గడ్డ బాల్ రాజ్, రాఘవ చారి, సీనియర్ నాయకులు విఠల్ చారీ, మురళి కృష్ణ, శేఖర్ సుమన్, ప్రకాశ్, ఇంద్ర నగర్ వాసులు, భక్తులు, పిల్లలు, సీనియర్ నాయకులు,డివిజన్ నాయకులు, స్థానిక నేతలు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## పోషకాహారం నిత్యం తీసుకోవాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల అంబేద్కర్ నగర్ యూపీహెచ్ సీలో టీబీ పేషెంట్లకు పోషకాహార కిట్ల పంపిణీ




**రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి జనవరి 23 (ప్రజాజ్యోతి) :** టీబీ పేషెంట్లు కచ్చితంగా నిత్యం పోషకాహారం తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనీ అంబేద్కర్ నగర్ లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీబీ బాధితులకు పోషకాహార కిట్లు, కోడిగు డ్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. టీబీ ముక్త్ భారత్ లో భాగంగా జిల్లాలోని అన్ని పీహెచ్ సీలు, అర్బన్ హెల్త్ సెంటర్, ఏరియా హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బస్తీ దవఖానాల్లో ఆరోగ్య పరీక్షలు చేస్తారని వివరించారు. అలాగే మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రతి నెలా రూ. వెయ్యి సహాయం అంది స్తున్నారని వెల్లడించారు. పేషెంట్లు కచ్చితంగా మందులు వాడుతూ.. పోషకాహారం తీసుకోవాలని సూచించారు. టీబీ నియంత్రణకు నిక్షయ మిత్ర ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పట్టణాలు, మండలాల్లో కలిపి మొత్తం 353 మందికి పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. సమావే శంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రజిత, ఐఎంఏ అధ్యక్షురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత కొత్త అనిల్..



**కరీంనగర్ టౌన్, జనవరి 23 (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో శుక్రవారం బీఆరస్ నేత, 50వ బీఆరస్ అధ్యక్షుడు కొత్త అనిల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనిల్‌తో పాటు ఎస్ గోపి కొత్త అరవింద్ సాయిళ్ళ శ్రీనివాసుతో పాటు పలువురు కాంగ్రెస్‌లో జాయిన్ అయ్యారు. వారికి రాజేందర్ రావ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి తప్పకుండా తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కొత్త అనిల్ పేర్కొన్నారు. రాజేందర్ రావ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అదేవిధంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి పాటు పడతామని తెలిపారు.

## పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో భారీ చేరికలు





**పెద్దపల్లి ప్రతినిధి, జనవరి 23 (ప్రజా జ్యోతి) :** పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలని, ఐక్యతతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ఎమ్మెల్యే చేస్తున్న ప్రజాసేవలకు ఆకర్షితులై బీఆర్?ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన వంద మందికి పైగా నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 29వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇల్లందుల కృష్ణమూర్తి--రజిని దంపతులు, 10వ, 5వ వార్డులకు చెందిన పలువురు బీజేపీ, బీఆర్?ఎస్ నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలోకి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి జరుగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే హామీల అమలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని పురోగమన దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. గత పాలకులు పెద్దపల్లి పట్టణ అభివృద్ధిని విస్మరించారని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి పట్టణాన్ని సుందరంగా మారుస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్నామని, అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 10 లక్షల ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం, రేషన్ కార్డులు వంటి పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతోందన్నారు.

నూతన బస్సు డిపో, బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, కోర్టు భవనం వంటి పనులు చేపడుతున్నామని చెప్పారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 17.86 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి ప్రతినిధి, జనవరి 23(ప్రజాజ్యోతి) :** పెద్దపల్లి పట్టణాన్ని అందమైన సిటీగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. జనవరి 23న రూ. 17.86 కోట్ల వ్యయంతో వివిధ వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అవసరమైతే మరిన్ని నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పెద్దపల్లికి యూఐడీఎఫ్ నిధులుగా రూ. 63 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. జిల్లా కేంద్రంలో బస్సు డిపో ఏర్పాటు చేసి గుర్తింపు తీసుకొచ్చామని, గత ప్రభుత్వ హయాంలో పట్టణాభివృద్ధి నిర్లక్ష్యం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫ్యామిలీని టచ్ చేసే దమ్ము కాంగ్రెస్ లేదు

- ముడుపులు దండుకునేందుకు విచారణ పేరుతో సాగదీతలు
- ఫోన్ ట్యాపింగ్ జరిగిందనడానికి ఆధారాలన్నీ ఉన్నాయి
- కేటీఆర్ చేసిన అరాచకాలు గుర్తుకొస్తే రక్తం మరుగుతోంది.
- మేం అధికారంలోకి ఉంటే కేసీఆర్ కుటుంబానికి గుణపాఠం చెప్పే వాళ్లం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, జనవరి 23 (ప్రజాజ్యోతి) :** ఫోన్ ట్యాపింగ్ తోపాటు అనేక అవినీతి, అక్రమాలు, అరాచకాలకు పాల్పడినప్పటికీ కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి లేనేలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం కరీంనగర్ లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ పై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతోపాటు కేటీఆర్ అరాచకాలను వివరిస్తూ తీవ్రస్థాయిలో స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పౌరుషం లేదని, చేతులు ముడుచుకుని కూర్చున్న అసమర్ధ ప్రభుత్వమని మండిపడ్డారు. ఢిల్లీకి ముడుపులు కోసమే ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో సాగదీస్తున్నారని అన్నారు. విచారణ పేరుతో హడావుడి చేసినప్పుడల్లా ఫాంహౌజ్ నుండి ఏఐసీసీకి ముడుపులు వెళుతున్నాయని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందనడానికి అన్ని ఆధారాలు, సాక్షాలు పోలీసుల వద్ద ఉన్నాయని, తనను విచారణకు పిలిచిన సమయంలో ఆ ఆధారాలను, సాక్షాలను సైతం చూపించారని తెలిపారు. జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు తేలిందన్నారు. అయినా కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. నిజానికి సిట్ అధికారులు సమర్థులు, నిజాయితీపరులు. కానీ వాళ్లపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తోందన్నారు. సిరిసిల్ల కేంద్రంగా వార్ రూంను ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ చేశారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ బిల్డర్లు, వ్యాపారులను, సినీ నటులను బెదిరించి కోట్లు దండుకున్నారన్నారు. నా ఫోన్లను, ప్రస్తుత సీఎం, మంత్రుల ఫోన్లతోపాటు జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. ఇన్ని సాక్షాలు, ఆధారాలున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?అని ప్రశ్నించారు.. విచారణకు పిలిచినప్పుడల్లా ఏఐసీసీకి ఎక్కువ ముడుపులు అందుతున్నాయోమో. ఏఐసీసీకి, ఫాంహౌజ్‌కు మధ్య పూర్తి డీల్ కుదరకపోవడంతోనే విచారణ పేరుతో డ్రామాలాడుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే తప్పు చేసిన రాజకీయ నాయకులను, అధికారులను అరెస్ట్ చేయాలని కోరారు.

## పరిపాలన అంశాలపై అధికారులు దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి, జనవరి 23 (ప్రజాజ్యోతి) :** జిల్లాలో పరిపాలన వ్యవహారాలు మరింత సమర్థవంతంగా సాగాలంటే అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీతో కలిసి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి శాఖలో జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో ఉన్న ఖాళీల వివరాలను వెంటనే సమర్పించాలని, వివిధ శాఖల వద్ద ఉన్న ఇంట్రెస్ట్ ఫండ్స్ వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్ మెంట్‌కు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలను వారం రోజుల్లోగా క్లియర్ చేయాలని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు, సమావేశాల్లో ప్రోటోకాల్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్‌లకు అవసరమైన ఎన్‌ఓసీలు జారీ చేయాలని, కోర్టు కేసుల వివరాలను జనవరి 28 నాటికి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, కలెక్టరేట్?లో ఉపయోగం లేని పాత సామగ్రిని తొలగించాలని సూచించారు. సిబ్బంది విధులకు సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గణతంత్ర దినోత్సవ వేడుకల సందేశాన్ని క్లుప్తంగా రూపొందించాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేటు భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను షిఫ్ట్ చేయాలని, కలెక్టరేట్ వెబ్?సైట్?లో శాఖల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## యువ ప్రతిభను ప్రోత్సహించడంలో టీజీఐసీ కీలకపాత్ర

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ బ్యూరో, జనవరి 23 (ప్రజాజ్యోతి) :** యువత ప్రతిభను ప్రోత్సహించడంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టిజిఐసి) కీలక పాత్ర పోషిస్తున్నదని, వారి ఆవిష్కరణలు పోటీ మార్కెట్‌కు తట్టుకునే విధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లాలో ఉన్న ఔత్సాహిక ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులను ప్రోత్సహించడంలో భాగంగా తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ కరీంనగర్‌లోని ఐటీ టవర్‌లో "ఇన్నోవేషన్ పంచాయత్ "కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సదస్సుకు కరీంనగర్, సిద్దిపేట, మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుండి 60కి పైగా ఔత్సాహిక వ్యవస్థాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. నిధుల సేకరణ, వ్యాపార విస్తరణ, మార్కెటింగ్ మెళకువలకు సంబంధించి తమకున్న సందేహాలను నిపుణులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆవిష్కరణ సవాలతో కూడినదని, వాటిని అమలు చేసే



సమయంలో ఎన్నో అడ్డంకులు, లోపాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. వాస్తవ ప్రపంచానికి తగినట్లుగా ఉత్పత్తిని తీర్చిదిద్దడం చాలా అవసరమని తెలిపారు. ఆవిష్కరణలో వచ్చే కష్టాలు విజయానికి మార్గాలుగా భావించి వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన ఆలోచనలు సమాజంలో ప్రభావవంతమైన పరిష్కారాలుగా మారాలని ఆకాంక్షించారు. యువత, విద్యార్థులు తమ ఆవిష్కరణలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలపై మాత్రమే ఆధారపడకుండా మార్కెట్లో స్వతంత్రంగా నిలబడే స్థిరత్వాన్ని కలిగి ఉండాలని అన్నారు. కాలానికనుగుణంగా తమ సాంకేతికను మార్చుకునేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. తెలంగాణలో యువత సృజనాత్మకత కొదువు లేదని, సరైన మార్కెట్ తోడైతే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీ సీఈవో మేరాజ్ ఫహీమ్, కమ్యూనికేషన్ మేనేజర్ బుద్ధవరపు వాణి పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య



### జిల్లా పరిషత్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**కథలాపూర్, జనవరి 23 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం గంభీర్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, త్రాగునీరు, వంటశాల, భోజనశాల, వసతి గృహంలో వసతులు, పడకలు, మూత్రశాలలు, గదులను పరిశీలించారు. మెనూ ప్రాకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థుల పాఠ్యంశాల్లోని సిలబస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషించి విద్యార్థులతో పాఠాలు చదివించి వారి భోదన స్థితి గతులను ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో, సాంస్కృతిక, ఇతర నైపుణ్యాల్లో కూడా రాణించాలని సూచించారు. 26వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో జిల్లా కలెక్టర్ విద్యార్థులతో పాటు స్వయంగా పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ జివాకర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి రాము, తహసిల్దార్ వినోద్, ఎంఈఓ లోకిని శ్రీనివాస్, సర్పంచ్ గుంటుక మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ అధికారులతో సమావేశం

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి,జనవరి 23 (ప్రజాజ్యోతి) :** జనవరి 26వ తేదీన భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించేందుకు గ్రౌండ్, డయాస్ ను రెవెన్యూ అధికారులు పూల అలంకరణతో సిద్ధం చేయాలని సూచించారు. వేడుకల సందర్భంగా ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, వారికి ఆహ్వానం పంపించా లని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన స్టాళ్లు, శకటాల ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి అధికారులను నియమించాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేందుకు వీలుగా, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన ప్రగతి సందేశాన్ని తయారు చేయాలని జిల్లా ప్రణాళిక అధికారికి సూచించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఆ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ సిబ్బంది ఉండాలని పేర్కొన్నారు. గ్రౌండ్‌లో పారిశుధ్య పనులను సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. వేడుకల సందర్భంగా గ్రౌండ్ కు వచ్చు ప్రజలకు, విద్యార్థిణి, విద్యార్థులకు త్రాగు నీటిని సమకూర్చాలని, జాతీయ భావం పెంపొందేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించేందుకు ప్రతిపాదనలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



**ఏర్పాట్ల పరిశీలన :** భారత గణతంత్ర దినోత్సవ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో చేస్తున్న ఏర్పాట్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితేతో కలిసి పరిశీలించారు. గ్రౌండ్ లో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసారు. వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల వెంకటేశ్వర్లు, ఏఓ రాంరెడ్డి, తహసిల్దార్ మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్-బీజేపీ ఒక దొంగల ముఠా ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ బ్యూరో, జనవరి 23 (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఒక దొంగల ముఠాగా తయారయ్యాయని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. కరీంనగర్ నగరంలోని 28వ డివిజన్‌లో బీఆరస్ పార్టీ అభ్యర్థి కుర్ర తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో బీఆర?స్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే పార్టీలను గుర్తించాలని, ప్రజల మధ్య ఉండే పార్టీ బీఆర?స్ అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ అభివృద్ధికి ఏమీ చేయలేదని, బీఆర?స్ ప్రభుత్వ హయాంలోనే కరీంనగర్ అభివృద్ధి జరిగిందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నగరం వెలవెలబోయిందని, కేబుల్ బ్రిడ్జిపై లైట్లు కూడా వెలగడం లేదని విమర్శించారు. అభివృద్ధి చేసిన బీఆరస్‌ను మర్చిపోకుండా ఓటేయాలని, మూడేళ్లలో మళ్లీ బీఆరస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆరస్ నేతలు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యత

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- నగరంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా పటిష్ట చర్యలు
- నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు
- త్వరలో మరో 2500 ఇందిరమ్మ ఇండ్లు నగరంలో మంజూరు
- ఖమ్మం 4వ డివిజన్ నందు నిర్మించిన బాలాజీ నగర్ అర్బన్ పిహెచ్‌సి భవనాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల





**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** స్థానిక విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి,సహకార,మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రివర్యులు,శుక్రవారం ఖమ్మం 4వ డివిజన్ బాలాజీ నగర్ లో 2 కోట్ల 43 లక్షలతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనాన్ని, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి రోగాలతో అనేక ఇబ్బందులతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలతో సిబ్బంది ప్రేమ ఆప్యాయతలతో ప్రవర్తించాలని, మన ప్రవర్తనతో రోగి సగం బాధ నయం అవుతుందని అన్నారు.ఆసుపత్రి పరిసరాలలో పచ్చని మొక్కలు పెంచాలని, ఆసుపత్రి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వైద్య శాఖకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు అవసరమైన మేర కలెక్టర్, కమీషనర్ నుంచి నిధులు తీసుకొని ఆసుపత్రి చుట్టు పక్కల పరిశుభ్రత, పారిశుధ్యం పాటించాలని అన్నారు. ఆసుపత్రి అవసరాలకు అవసరమైతే ప్రజా ప్రతినిధులు, మంత్రుల నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయిస్తామని మంత్రి తెలిపారు.జిల్లాలో అందుబాటులో ఉన్న సిబ్బంది ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్ నందు వైద్య సేవలు కోసం కేటాయించాలని, అవసరమైన నూతన పోస్టులు మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు పంపితే సంబంధిత వాటిపై చర్చించి మంజూరు చేయిస్తానని అన్నారు.మంచి విద్య, వైద్య అవకాశాలతో ఖమ్మం ప్రశాంత నగరంగా అభివృద్ధి చెందాలని , విద్య, వైద్య రంగాలను రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని అన్నారు. 2 వేల 200 ఇందిరమ్మ ఇళ్లను ఖమ్మం నగరంలో అర్హులైన పేదలకు ఇచ్చామని త్వరలో మరో 2 వేల 500 ఇండ్లు మంజూరుకి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రభుత్వానికి వీలైనంత వరకు పేద ప్రజల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తుందని అన్నారు. 13 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రభుత్వం నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తుందని, పేదలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ అందిస్తున్నామని అన్నారు.గతంలో తాన మంత్రిగా ఉన్నప్పుడు 6000 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేశానని, వాటిలో పెండింగ్ నిర్మాణాలను కూడా పూర్తి చేసి, రోడ్డు విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలలో నిర్వాసితుల పేదలకు కేటాయించేలా చర్యలు చేపట్టామని అన్నారు.ఖమ్మంలోనే మార్కెట్ వద్ద రోడ్డుపై నివసిస్తున్న 28 పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించి రోడ్డు విస్తరణ చేశామని మంత్రి తెలిపారు. రోడ్డు విస్తరణలో ఎక్కడైనా భవనాలు కోల్పోతే వారికి పది రెట్లు పరిహారం అందిస్తామని అన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలలో గుడిసెలు వేద్దామని అధికారంలో ఉన్న నాయకులు ప్రయత్నించిన అధికారులు ఒప్పుకోవద్దని మంత్రి స్పష్టం చేసారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2 కోట్ల 43 లక్షలతో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ను నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. డివిజన్ ప్రజలకే కాకుండా చుట్టు పక్కల ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు ఉచితంగా అందిస్తామని అన్నారు.ప్రజలు ప్రతి చిన్న అవసరానికి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదని, చిన్న, చిన్న జ్వరం కేసులు, రక్త పరీక్షలు వంటి సేవలు హెల్త్ సెంటర్ వద్ద తీసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. స్థానిక జనాభా పరిధిలో గర్భిణులకు సంబంధించి 100 శాతం ఏ.ఎన్.సి. చెకప్ ఇక్కడి నుంచి జరగాలని కలెక్టర్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు.ఏ.ఎన్.సి. చెక్ అప్ లతో పాటు ప్రసవాలు, కొత్తగా పుట్టిన శిశువులకు టీకాలు కూడా 100 శాతం ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో జరిగేలా కృషి చేయాలని అన్నారు. వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. మంత్రి సూచనలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.నగరంలో అవసరమైన మేర నూతన అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.రామారావు, స్థానిక కార్పొరేటర్ డి. జ్యోతి రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు



**సత్తుపల్లి జనవరి 23(ప్రజా జ్యోతి)** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐ టి మంత్రి యువ నాయకులు నారా లోకేష్ 43వ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ వినుకొండ రమేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆఫీసులో కేక్ కటింగ్ చేసి, జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు పంపిణీ చేసుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఐటీ రంగంలో ఆంధ్రప్రదేశ్ ను ముందు ఉంచుతున్నారని అలాంటి నాయకుడు మరెన్నో పుట్టినరోజులు చేసుకొని ప్రజలకు సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరినారు. ఈ కార్యక్రమంలో పోట్రూ రామారావు పలగాని రమ్య, మల్లూరు మోహన్, రాచర్ల చంద్రశేఖర్, మందపాటి అనిల్ కుమార్ రెడ్డి తిమ్మిడి రాంబాబు, ఉ ఒడవల్లి.శ్రీకాంత్, యం డి పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు




**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు అన్న ఎన్టీఆర్ మనవడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు,భువనేశ్వరి కుమారుడు ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ జన్మదినం సందర్భంగా తెలుగుదేశంపార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయం రామాలయంలో లోకేష్ బాబు పేరు మీద అర్చన చేయించి పూజలు జరిపించారు,అనంతరం కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, అభిమానుల మధ్యన లోకేష్ కు ఘనంగా కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచడం జరిగింది, కార్యక్రమానికి వచ్చిన నారా నందమూరి అభిమానులకు టిడిపి నాయకులకు కార్యకర్తలకు అన్నదాన కార్యక్రమం జరిగింది,ఈ కార్యక్రమానికి తెలంగాణ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, గుత్తా సీతయ్య, నాయకులు వనమా వాసు, మందడపు సుధాకర్,మంద వెంకట నారాయణ, నల్లమల శ్రీనివాస్,మీగడ రామారావు,పెనుగొండ ఉపేందర్,రాజేశ్వరి, తాడిశెట్టి స్వాతి, కామ అనిత, లావణ్య, ఝాన్సీ, మందపల్లి కోటేశ్వరరావు, కూచిపూడి జై, కన్నేటి పృధ్వీ, నున్నా నవీన్,గుండెపిన్నీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొని యువ నేత నారా లోకేష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సత్తుపల్లి అభివృద్ధిని చరిత్రకు ఎక్కిద్దాం: ఎమ్మెల్యే రాగమయి

- మున్సిపాలిటీని గెలిపించుకుందాం.. 700 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకుందాం ఎమ్మెల్యే




**సత్తుపల్లి జనవరి23(ప్రజా జ్యోతి)** రానున్న మున్సిపల్ ఎలక్షన్లో సత్తుపల్లిని గెలిపించుకొని మున్సిపాలిటీలో 700 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి చరిత్రను అభివృద్ధిలో తిరగరాద్దామని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని వెంగల రావు నగర్ రోడ్ నెంబర్ 9 లో ఇటీవల మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు వర్గూట్టి సుధాకర్,భాగ్యలక్ష్మి వారి ఇల్లు మంజూరు చేయగా నిర్మాణాన్ని పూర్తి చేసుకొని స్థానిక శాసన సభ్యురాలు గృహప్రవేశానికి అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె గృహ గృహప్రవేశం చేసి,ఆ దంపతులకు నూతన వస్త్రాలను అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాన్ని అందించిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందు ఉంచుతున్నారని, అదేవిధంగా మున్సిపాలిటీ ఎలక్షన్లో కాంగ్రెస్ ని గెలిపిస్తే ఇంకా అభివృద్ధి చేసి అందరికీ ఉపయోగపడే విధంగా ఉంటుందని అన్నారు. నిరుపేదల అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, మున్సిపాలిటీ ఓటర్ మహాశయులందరూ కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా అందజేయాలని అందరికీ విన్నవించారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల నరసింహారావు తోట సుజలా రాణి,కంటే అప్పారావు, భాస్కర్, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు,మహిళలు ఉన్నారు.

## పౌరులుగా మన బాధ్యతలను తప్పకుండా నిర్వర్తించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి - నా భారత దేశం - నా ఓటు అనే థీమ్‌తో ఓటర్ దినోత్సవం
- జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఓటర్ల ప్రతిజ్ఞ





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక పౌరులుగా మన బాధ్యతలను తప్పకుండా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని, ప్రస్తుత సంవత్సర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జనవరి 23న అధికారులతో ఓటర్ ప్రతిజ్ఞ చేయిస్తున్నట్లు తెలిపారు.మన దేశంలో కులం,మతం, ప్రాంతం,వర్గం,భాష,పేదరికం,ధనికులు అనే అంతరం లేకుండా అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించడం జరిగిందని అన్నారు.ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరిని ముఖ్యంగా యువతను భాగస్వామ్యం చేసే దిశగా ప్రతి ఒక్కరు నిస్వార్ధంగా స్వేచ్ఛతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించేందుకు ఈ జాతీయ ఓటరు దినోత్సవాన్ని వినియోగిస్తామని అన్నారు.ప్రస్తుత సంవత్సరం నా భారతదేశం నా ఓటు అనే థీమ్ తో జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజాస్వామ్యంలో బాధ్యత గల పౌరులుగా దేశ అభ్యున్నతిలో మన భాగస్వామ్యం ఉండాలని అన్నారు. ఎన్నికల సమయంలో మన ఓటు వేయడంతో పాటు మనకు తెలిసిన అందరిని ఓటు వేసేందుకు ప్రోత్సహించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని అన్నారు.ఓటర్ జాబితాలో మన కుటుంబ సభ్యుల పేర్లు ఉన్నాయో లేదో చెక్ చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. గతంలో జనవరి 1 కట్ ఆఫ్ తేదీ క్రింద ఓటరు జాబితా సవరణ జరిగేదని,నేడు ఎన్నికల కమీషన్ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఓటరు జాబితా సవరణ అయ్యే విధంగా మార్పు తీసుకుని వచ్చిందని చెప్పారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఉద్యోగులతో కలిసి ఓటర్ ల ప్రతిజ్ఞ చేయించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రతిజ్ఞ చేయిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**ఖమ్మం వైరా: జనవరి 23 ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రోడ్డు వారోత్సవాల సందర్భంగా వైరాలో ఎం వి ఐ వరప్రసాద్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని, వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్ శుక్రవారం వైరా పుర ప్రముఖులతో, ప్రజాప్రతినిధులతో, అధికారులతో విద్యార్థినీ విద్యార్థులతో కలసి రింగ్ రోడ్డు సెంటర్లో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు వేగాన్ని నియంత్రిస్తూ ప్రయాణించాలని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ ని పాటిస్తూ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు గమ్యస్థానాలకు చేరాలని అన్నారు. తమను నమ్ముకొని కుటుంబాలు ఉన్న సంగతి ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని తెలిపారు. అతివేగంగా అనాలోచితంగా వాహనాలు నడపవద్దని మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల నడిపే వాళ్లతో పాటు ఇతరులకు కూడా ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. సెల్ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని చెప్పారు హరంలో పాల్గొన్న విద్యార్థులతో భద్రత విషయాల గురించి మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వారోత్సవాల విశిష్టతను తెలియజేశారు. అనంతరం పాల్గొన్న పాల్గొన్న అందరితో భద్రత జాగ్రత్తలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ వైరా మండల అధ్యక్షులు సీలం నర్సిరెడ్డి ఏఎంసి చైర్మన్ బోళ్ల గంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి నాగి, కట్ల సంతోష్, ముళ్ళపాటి సీతారాములు, దార్న రాజశేఖర్ పమ్మి అశోక్, పొదిల హరినాథ్, సూరంపల్లి రామారావు, కన్నెగంటి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏదులాపురం మున్సిపల్ కమిషనర్‌గా మున్వర్ అలీ బాధ్యతలు



**ఖమ్మం రూరల్ ప్రజాజ్యోతి:** ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్‌గా ఎండీ మున్వర్ అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన కమిషనర్లను రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి బదిలీలు చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ఇంతకాలం ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి నల్లగొండ జిల్లా హాలియాకు బదిలీ కాగా ఆయన స్థానంలో తిరుమలగిరి మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మున్వర్ అలీ ఏదులాపురం మున్సిపాలిటీకి బదిలీ కావడం జరిగింది. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌కు పలువురు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## గణతంత్ర వేడుకల కోసం సాంస్కృతిక ప్రదర్శనల ఎంపికలు

**కొత్తగూడెం సింగరేణి, జనవరి 23 - ప్రజాజ్యోతి:** సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం గ్రౌండ్ లో సోమవారం నిర్వహించే 77వ గణతంత్ర దినోత్సవ సెంట్రల్ ఫంక్షన్ వేడుకలలో ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించే విధంగా ఉండేలా ఎంపిక చేసేందుకు శుక్రవారమున కొత్తగూడెం చిల్డ్రన్స్ పార్క్ నందు ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు కొత్తగూడెం పట్టణంలోని గల వివిధ పాఠశాలల, కళాశాలల నుండి వచ్చిన విధ్యార్థిని విధ్యార్థులు ఎంతో ఉత్సాహంగా సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ఎంపిక కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) బి.శివకేశవ రావు డివై.పిఎంలు కే.శివ కుమార్, కే.సునిల్ కుమార్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, సేవా కొ-ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, స్కౌంట్స్ గైడ్స్ వివిధ పాఠశాలల, కళాశాలల నుండి వచ్చిన విధ్యార్థినీ, విధ్యార్థులు పాల్గొన్నారు.





## రంజాన్ మాసంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై నేడు సమావేశం

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్
- జిల్లాలోని ముస్లిం మత పెద్దలు, మస్జిద్ కమిటీ సదర్లు, మైనారిటీ నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక రాబోయే పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జిల్లాలో చేపట్టవలసిన ఏర్పాట్లపై చర్చించుటకు వీలుగా నేడు ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని ముస్లిం మత పెద్దలు, మస్జిద్ కమిటీ సదర్లు ప్రెసిడెంటు,సెక్రటరీ మైనారిటీ నాయకులు తప్పనిసరిగా హాజరై రంజాన్ మాస ఏర్పాట్లపై సూచనలు అందించాలని ముజాహిద్ ఆ ప్రకటనలో కోరారు.

## జనగణనకు కేంద్రం రంగం సిద్ధం

మొదటిపేజీ తరువాయి..

వాహన వినియోగం వంటి వివరాలు కూడా సేకరించాలని ఆదేశించింది. కుటుంబంలో ఎవరెవరు ఏయే పని చేస్తున్నారో స్పష్టమైన వివరాలు సేకరించాల్సిందే కేంద్రం తేల్చి చెప్పింది. ఏ విధమైన మరుగుదొడ్డి ఉందో రికార్డుల్లో స్పష్టంగా చెప్పాలని గణన



అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్నానాల కోసం ఏ తరహా బాత్‌రూం ఉందో వివరాల్లో పొందుపరచాలని తెలపాలని వెల్లడించింది. వంట కోసం వాడుతున్న గ్యాస్ కనెక్షన్ వివరాలను కూడా అధికారులు సేకరించనున్నారు. ఇంటి యజమాని ఎస్సీ, ఎస్టీ, ఇతర ఏ వర్గానికి చెందిన వారో అనే వివరాలు తప్పక నమోదు చేయాల్సి ఉంటుంది.

## కళలతో స్థితిస్థాపకత

బిక్కనూరు, జనవరి 23 (ప్రజాజ్యోతి)
ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉంది.





దానికి నిదర్శనంగానే కామారెడ్డి జిల్లా బిక్కనూరు పట్టణంలోని చైతన్య విద్యానికేతన్ పాఠశాల చెప్పుకోవచ్చు. ఇందులో భాగంగానే పాఠశాల కరస్పాండెంట్ రేణు కుమార్ కోడలు వలిపిశెట్టి మనీషా 50 కి పైగా అద్భుతమైన ఆర్ట్ చిత్రాలను గీసింది. వాటిని పాఠశాలలో ప్రదర్శనకు ఉంచడం జరిగింది. ఈ సందర్భంగా మనిషా మాట్లాడుతూ... వాటిని ఎలా గీయాలి అనే విషయాలను విద్యార్థులకు,ఉపాధ్యాయులకు తెలియచేసింది. ప్రతి విద్యార్థుల్లో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని దానిని సందర్భానుసారం వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే నని కరస్పాండెంట్ రేణు కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ అశోక్ యాదవ్, సుదర్శనం, రాజయ్య,ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇంత గొప్ప నైపుణ్యాన్ని కలిగిన మనీషాని ప్రత్యేకంగా అభినందిస్తూ,చదువులోనే కాదు ప్రతి రంగంలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న చైతన్య విద్యానికేతన్ పాఠశాలను "ప్రజాజ్యోతి" పత్రిక ప్రత్యేక అభినందించింది.

## హట్టహాసంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

గాంధారి, జనవరి 23 (ప్రజాజ్యోతి)
గాంధారి మండలంలోని ముదేల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. నిరుపేద కుటుంబాలకు



ఇండ్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ బిల్లులు ఆలస్యం కాకుండా చెల్లింపులు జరగడం, ఇసుక సమస్య లేకుండా సహకారం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

## పోతంగల్ కుర్దులో నూతన పాలకవర్గానికి సన్మానం

గాంధారి, జనవరి 23 (ప్రజాజ్యోతి)
గాంధారి మండలంలోని చిన్న పోతంగల్ గ్రామంలో శుక్రవారం నూతన పాలకవర్గానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొంపల్లి రాజులు గాంధారి మండల ఎల్ఐసి అధ్యక్షులు హాజరై నూతన పాలకవర్గ సభ్యులను సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఎల్ఐసి పాలసీలు పొందేలా అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఎల్ఐసి ద్వారా కుటుంబాలకు ఆర్థిక భద్రత కలుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు పాల్గొనగా, రవి, దత్తు, కాశీరామ్ తదితరులు పాల్గొన్నారు.



# మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయం

మొదటిపేజీ తరువాయి..

కింద గతంలో సుమారు రూ.80 కోట్ల వ్యయంతో ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం వంటి ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు కల్పించారు. రోడ్లు, వసతి సౌకర్యాలు, పర్యాటక సమాచార కేంద్రాలు, ఇతర సదుపాయాలు కల్పించడంతో ఈ ప్రాంతాలకు పర్యాటక ఆకర్షణ మరింత పెరిగింది. సమ్మక్క - సారలమ్మల జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి జాతరతో భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నిరంతరంగా సహకారం అందించడం గిరిజన సంస్కృతి పరిరక్షణకు తోడ్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.140 కోట్లను వెచ్చిస్తోంది. రామప్ప ఆలయం, మేడారం జాతర, పరిసర అటవీ ప్రాంతాలు అన్నింటినీ కలిపి తెలంగాణ గిరిజన, ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అమ్మవార్లకు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు మేడారం జాతరకు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల రవాణా సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే శాఖ జాతర జరిగే నాలుగు రోజుల పాటు 30 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్ల ద్వారా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు సులభంగా మేడారం చేరుకునేలా ఏర్పాటు చేశారు.

# మేడారంలో జనజాతర

మొదటిపేజీ తరువాయి..

ఈ నెల 28 నుంచి 31 వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు దక్షిణమధ్య రైల్వే మేడారం జాతర ప్రత్యేక రైళ్లను ఈ నెల 28 నుంచి నడుపనుంది. రాష్ట్రంలోని సికింద్రాబాద్, మంచిర్యాల్, సిరిపూర్‌కాగజ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం ప్రాంతాల నుంచి మేడారం జాతర ప్రత్యేక రైళ్లు వరంగల్, కాజీపేటల వరకు నడుస్తాయని దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు నడిచే మేడారం జాతర ప్రత్యేక రైళ్లు పూర్తిగా అన్ రిజర్వుడ్ జనసాధారణ రైళ్లని జాతర వెళ్లే భక్తులు ఈ రైళ్లను వినియోగించుకోవాలని కోరారు. ఇవి ఆయా మార్గాల్లోని అన్ని స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. ఈనెల 28, 30, ఫిబ్రవరి 1 తేదీల్లో సికింద్రాబాద్ -మంచిర్యాల్- సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు కాజీపేట మీదుగా కాజీపేట మీదుగా నడుస్తాయి. సికింద్రాబాద్-మంచిర్యాల్ రైలు(07495) ఉదయం 5.45 గంటలకు సికిందరాబాద్‌లో బయలుదేరి ఉదయం 8.45 గంటలకు కాజీపేటకు, మధ్యాహ్నం 1.30 గంటలకు మంచిర్యాల్ చేరుకుంటుంది.

## వ్యవసాయం ఓ విజ్ఞానం

మొదటిపేజీ తరువాయి..

ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు,అధికారులు గవర్నర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించి లబ్ధిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్‌నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద 100 ఎకరాలలో 150 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన చేశారు .అంతేగాక కోదాడ సమీపంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయానికి శంకుస్థాపన చేయడమే కాక, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్ కు, మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే డార్మెటరీ బిల్డింగులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషమని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అందరూ కృషి చేయాలి : ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి,జనవరి– 23 (ప్రజా జ్యోతి)
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ



గెలుపునకు ప్రతి కార్యకర్తలు కృషి చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 12, 4వ వార్డులో ఎమ్మెల్యే మదన్ మోహన్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు, స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా 12వ వార్డులో కొనసాగు తున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీ లించారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతతో పాటు పనులను వేగవంతం చేయాలన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎల్లారెడ్డి



పట్టణం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. బస్ స్టాండ్ అభివృద్ధి, మినీ ట్యాంక్ బండ్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, మార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు పట్టణంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని స్పష్టం చేశారు. అదేవిధంగా, సేవాలాల్ జగదంబ మాత ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని, ఎల్లారెడ్డి పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఎల్లారెడ్డి మున్సిపల్ 4వ వార్డు (దేవునిపల్లి)లో గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్ చేశారు. దేవునిపల్లి గ్రామంలో నల్ల పోచమ్మ తల్లి ఆలయం సమీపంలో నిర్మించనున్న ఫంక్షన్ హాల్‌కు సంబంధించి రూ.10 లక్షల నిధుల ప్రొసీడింగ్ కాపీని గ్రామ ప్రజలకు అందజేశారు. నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు సత్యనారాయణ, పద్మ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాగం గోపికృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ నూనె శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు వినోద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్ గౌడ్, కురుమ సాయిబాబా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలి

సదాశివనగర్ జనవరి 23 (ప్రజాజ్యోతి)
విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని




కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని ఇంటర్మీడియట్ బోర్డ్ స్పెషల్ ఆఫీసర్ వడ్డెన్న అన్నారు. సదాశివనగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు పరీక్షల నిమిత్తం తగిన సలహాలు సూచనలు అందించారు. ప్రధానంగా రాబోయే వార్షిక పరీక్షలలో మంచి మార్కులు సాధించడానికి ఇప్పటినుండి 35 రోజుల ప్రణాళికను ఏర్పరచుకొని క్రమశిక్షణతో రివిజన్ చేస్తూ, టీవీకి సెల్ఫోన్ కు దూరంగా ఉంటూ కష్టపడినట్లయితే మంచి ఉత్తీర్ణత సాధిస్తారని సూచించడం జరిగింది. అధ్యాపకులు విద్యార్థులకు తగిన రివిజన్ షెడ్యూల్ తయారుచేసు కొని విద్యార్థులను ప్రోత్సహించినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఐఏఎస్ ఆదేశాను సారం తల్లిదండ్రుల, అధ్యాపకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సదాశివనగర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి వంకాయల శిరీష రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్ , వార్డు మెంబర్ సాగర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీమతి గువ్వా భూదేవి, కళాశాలలో చదివి వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులు అయిన సంజీవ్ (ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్), దుద్ద అరవింద్ (ఆర్మీ జవాన్), పాలబోయిన సునీత (ఫారెస్ట్ డిపార్ట్మెంట్), నాయిని గోపి (పిజిటి సోషల్ వెల్ఫేర్ గురుకులం) హాజరై విద్యార్థులు చదువుకోవడానికి పేదరికం అడ్డు కాదని, కష్టపడి చదివితే ఆటంకాలను అధిగమించవచ్చని, ఫలితంగా మంచి ఉద్యోగాల్లో స్థిరపడవచ్చు అని తెలిపారు. సర్పంచ్ వంకాయల రవి శిరీష గారు మాట్లాడుతూ



ఉపాధ్యాయులు చెప్పిన చదువును నిర్లక్ష్యం చేయకుండా, కష్టపడి చదువుతూ, తల్లిదండ్రులకు విద్యాసంస్థకు మంచి పేరు తేవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి గువ్వా భూదేవి, కళాశాల ప్రిన్సిపల్ సింగం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని పరిసర ప్రాంత విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని కళాశాలలో ఎస్ఎస్సి పాసైన విద్యార్థులు చేర్పించేలా కృషి చేయాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది , తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## సీతక్క పర్యటనలో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పెంబర్తి క్రాస్ వద్ద చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణలో ఇరు పార్టీల శ్రేణులు పాల్గొన్నారు. కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి ఆహ్వానించారు. ఇది బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నేతలు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. పల్లా గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. రెండు పార్టీల శ్రేణులను పోలీసులు చెదరగొట్టారు.ఇరువర్గాల మధ్య వాగ్వాదం తీవ్ర స్థాయికి చేరడంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర తోపులాట చేసుకుంది. ఎమ్మెల్యే పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు కాంగ్రెస్ నేతలు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు.

## నిరాధార ఆరోపణలతో పరువుకు భంగం

మొదటిపేజీ తరువాయి..

న్యాయవాది ద్వారా ఈ నోటీసులు పంపిన స్పీకర్.. పలు అంశాలను అందులో ప్రస్తావించారు. ఆనంద్ తనపై నిరాధార ఆరోపణలు చేసి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మానసికంగా క్షోభ పెట్టినందుకు మాజీ ఎమ్మెల్యే రూ.10కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని స్పీకర్ నోటీసుల్లో పేర్కొన్నారు. అలాగే వారం రోజుల్లో బహిరంగంగా తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే చట్టం ప్రకారం.. న్యాయస్థానాల ద్వారా తగు చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మెతుకు ఆనంద్ ఈ ఏడాది జనవరి 14, 19 తేదీల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. తనపై నిరాధార, తప్పుడు, అసత్య, అభూత కల్పనలు, కట్టు కథలతో కూడిన అవినీతి ఆరోపణలతో పాటు చేశారని ధ్వజమెత్తారు. తన వ్యక్తిగత జీవితానికి, గౌరవానికి భంగం కలిగించే విధంగా ఆ వ్యాఖ్యలున్నాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసుల్లో వివరించారు.

## శివాలయంలో దొంగతనం

రామారెడ్డి జనవరి 23 (ప్రజా జ్యోతి):
రామారెడ్డి మండలం ఈసన్నపల్లి గ్రామంలో కొలువై ఉన్న పవిత్రమైన ఉమామహేశ్వర (పులిహోరీ శివాలయం) లో గురువారం రాత్రి ఆలయం గుడి తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు అర తులం



బంగారం దొంగిలించడం జరిగిందని అవి ఐదు జతలు అమ్మవారి పుస్తెలకు సంబంధించిన బంగారం దొంగిలించడం జరిగిందని ఆలయ పూజారి, స్థానికుల సమాచారం మేరకు స్థానిక ఎస్సై పి. రాజశేఖర్ పర్యవేక్షించి దర్యాప్తు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967

## ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

రాజంపేట జనవరి 23 (ప్రజా జ్యోతి)
రాజంపేట మండల పరిధిలోని తలమడ్ల గ్రామంలో ఆజాద్ హింద్ ఫౌజ్ ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు



అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్నాల లక్ష్మీ జగదీష్, ఉప సర్పంచ్ నర్మాల వెంకట్, 3వ వార్డు సభ్యులు మోకద్దం బాలయ్యతో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అలాగే ఆజాద్ హింద్ ఫౌజ్ సభ్యులు కమ్మరి దుర్గ ప్రసాద్, కుంట శ్రావణ్ కుమార్, గణేష్ యూత్, గల్ఫ్ యూత్ సభ్యులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశ స్వాతంత్ర్య సాధన కోసం చేసిన త్యాగాలు, ఆజాద్ హింద్ ఫౌజ్ ద్వారా చూపిన ధైర్య సాహసాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నేతాజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం: రమేష్ సీతాలే

బాన్సువాడ/బీర్కూర్, ఆర్ సి జనవరి 23 (ప్రజాజ్యోతి)
భీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొన్నిరోజుల క్రితం కోటగిరి లో జరిగిన రక్త దాన కార్యక్రమంలో పోతంగల్ ఆర్ కే హోటల్ లో




పనిచేసే జల్లపల్లి గ్రామానికి చెందిన మంద అరుణ్ చిన్న వయసులోనే వాళ్ళ మామ బ్యాంక్ మారుతి, రమేష్ ను ఆదర్శంగా తీసుకుని చిన్న వయసులోనే రక్తదానం చేయడం జరిగింది, రక్తదానం చేయడం వలన ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఎదుటి వారికి సహాయం చేసిన వారవుతారని ఆయనను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీతాల రమేష్ అభినందించారు.
ఈ కార్యక్రమంలో హోటల్ యజమాని గంట్ల గజనన్, గ్రామ యువకులు భీమ్ రావ్ పటేల్,వడ్ల దత్తుమహజన్ రాజు,మేధరి శంకర్ పాల్గొన్నరు

## విద్యార్థులతో వాలిబాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ప్రతినిధి జనవరి 23. (ప్రజాజ్యోతి)



జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ జిల్లా కేంద్రంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, వసతి సదుపాయాలు, భోజన ఏర్పాట్లు , స్టోర్ రూమ్ తదితర అంశాలను పరిశీలించారు.
అనంతరం విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడిన కలెక్టర్ భోజన వసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి వాలిబాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరచ డంతో పాటు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ గిరిజన సంక్షేమ శాఖ అధికారి సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, తహసిల్దార్ జనార్ధన్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

సదాశివనగర్ జనవరి 23 (ప్రజాజ్యోతి)
సదాశివనగర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో వసంత పంచమి సందర్భంగా సర్పంచ్ టెక్రియాల లావణ్య రమేష్ అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న చిన్నపిల్లలను ప్రతి ఒక్కరిని



అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య విద్యతో పాటు విద్యార్థులకు మంచి ఆహారం అందించాలని అంగన్వాడీ టీచర్ కవితకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడ్ల గంగారం, గ్రామ పంచాయతీ పాలకవర్గం సెక్రటరీ ప్రకాష్ గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## పరిశుభ్రతపై పాలకవర్గ నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

రాజంపేట జనవరి 23 (ప్రజా జ్యోతి)
రాజంపేట మండల పరిధిలోని తలమడ్ల గ్రామంలో పారిశుధ్య సమస్యలు, అర్ధాంతరంగా నిలిచిపోయిన బ్రిడ్జి పనుల కారణంగా గ్రామ ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని డ్రైనేజీ కాలువల మురుగు నీరు రహదారిపైకి వచ్చి ప్రవహించడంతో ప్రధాన రహదారి పూర్తిగా మురికి నీటితో నిండిపోయింది. దీంతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు రోజూ రాకపోకల్లో భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ ప్రవేశ ద్వారం వద్ద గల గాంధీ చౌరస్తా నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గమంతా మురుగు నీరు నిలిచిపోవడంతో ఇండ్లకు వెళ్లాలన్నా ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనికి తోడు గ్రామంలో చేపట్టిన బ్రిడ్జి పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా కూడా ర్యాంపు ఏర్పాటు చేయక పోవడంతో వాహనాలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనేజీ నీరు రహదారిపై నిలిచిపోవడం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు భయపడుతున్నారు. తక్షణమే డ్రైనేజీ మురుగు నీటిని గూనలతో అడ్డగించి, ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించడంతో పాటు బ్రిడ్జి వద్ద తాత్కాలిక ర్యాంపు ఏర్పాటు చేయాలని అధికారులను




కోరుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా గ్రామానికి సరైన పాలకవర్గం లేకపోవడం వల్లే ఈ సమస్యలు పేరుకుపోయాయని స్థానికులు అంటున్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన పాలకవర్గం వచ్చినప్పటికీ ఇప్పటివరకు పారిశుధ్యం, బ్రిడ్జి పనులపై ప్రత్యేక దృష్టి సారించ కపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
"రెండు సంవత్సరాలుగా పాలకవర్గం లేదు... ఇప్పుడు వచ్చినా సమస్యలు పరిష్కారం కావడం లేదు" అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కనీసం ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో పెట్టుకొని అయినా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని తలమడ్ల గ్రామ ప్రజలు పాలకవర్గం, అధికారులను వేడుకుంటున్నారు.

## విషపు కోరల్లో గ్రామాలు

- ఎమ్మెస్ ఎన్ పరిశ్రమతో వాయు కాలుష్యం
- వాయు కాలుష్యంతో మంచాన పడుతున్న గ్రామాలు
- ఉపాధి మాట దేవుడెరుగు ఊపిరి పోతుంది

భిక్కనూరు, జనవరి 23 (ప్రజాజ్యోతి)
పల్లెలంటే పచ్చని పంట పొలాలు, పక్షుల కిలకిల రావాలు అని చూసాం, చదువుకున్న, విన్నాం కానీ, అభివృద్ధి పేరుతో గ్రామాల్లో రాకాసి కంపెనీలు రాజ్యమేలుతున్నాయి. కామారెడ్డి జిల్లా లో ఉపాధి లేక పొరుగు దేశాలకు వలస వెళ్లిన రోజుల నుండి సొంత ఊర్లో ఉపాధి దొరుకుతుంది అనే ఆశతో పరిశ్రమలకు అనుమతులు ఇస్తే, స్థానికులను ఆదుకొని,ఉపాధి అవకాశాలు లేకపోగా,ఊపిరితో ఉంటే చాలు అనే విధంగా పరిశ్రమల పనితీరు ఉందని భిక్కనూరు మండలం గ్రామాల ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిశ్రమలోని ఉన్నత పదవులన్నీ ఆంధ్ర వ్యక్తుల్లో చెప్పు చేతల్లో ఉన్నాయి. ఆ పరిశ్రమల వల్ల స్థానికులకు ఎటువంటి ఉపయోగం లేకపోగా, ఆరోగ్యాలు క్షీణించి




ఆసుపత్రుల పాలవడం గ్రామాల ప్రజల వంతయింది . జనవరి 14,2026 రోజు కంచర్ల గ్రామానికి చెందిన గొల్ల భాగయ్య పరిశ్రమల నుండి వెలువడిన కాలుష్యపు దుర్వాసన వలన మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఎంఎస్ఎన్ పరిశ్రమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మహేందర్ యాదవ్ మరియు రజనీకాంత్ రెడ్డి గ్రామస్తులు అంతా కూడా ఈ మరణం భాగయ్యతో ఆగుతుందా? లేక మునుముందు గ్రామాలను స్మశానాలుగా మారుస్తారా? అంటూ కన్నెర్ర చేశారు. ఈ పరిశ్రమను మూసే వరకు ఉపేక్షించబోమని, దీనిపై ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టి గ్రామాలను విషపు కోరల నుండి కాపాడాలని డిమాండ్ చేశారు.

## నూతన షెడ్డు ప్రారంభం

- ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ దేవికి షెడ్డు నిర్మాణం
- సొంత నిధులతో షెడ్డు నిర్మించిన సృజన్ పంతులు

భిక్కనూరు, జనవరి 23 (ప్రజాజ్యోతి)
భిక్కనూరు మండలంలోని కంచర్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి, నూతన షెడ్డు నిర్మించడం జరిగింది. శుక్రవారం రోజు వసంత పంచమిని పురస్కరించుకొని షెడ్డును ప్రారంభించడం జరిగింది. పాఠశాల ఆవరణలోని సరస్వతి విగ్రహం సురక్షితంగా ఉండటమే కాకుండా విద్యార్థులు ప్రార్ధన సమయంలో వీలుగా ఉంటుందని షెడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు సృజన్ పంతులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యా సంస్థలకు ఇలాంటి సేవలు





ఎంతో ప్రోత్సాహకర మని విద్యార్థులను ఆధ్యాత్మిక తోపాటు, పాఠశాల అభివృద్ధికి దోహద పడినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంటాల తిరుపతి గౌడ్, పెంటల నరస గౌడ్, మెజీషియన్ సంతోష్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వార్డ్ మెంబర్లు పోలు నరేందర్, పోలు శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

- ఇంచార్జ్ ప్రోగ్రాం ఆఫీసర్ యమీమా

భిక్కనూరు,జనవరి 23 (ప్రజాజ్యోతి)
భిక్కనూరు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, మెటర్నటీ చైల్డ్ హెల్త్ డాక్టర్ యమీమా, డీడియం అశ్విని, చైతన్య నర్సింగ్ ఆఫీసర్ లు ఆకస్మిక తనిఖీని చేశారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలోని ప్రతి రూమును పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఎం సి హెచ్ ప్రోగ్రాం లో భాగంగా ఈనెల ఎంతమంది గర్భవతులు నమోదయ్యారు, ఎంతమంది గర్భవతి డెలివరీ అయ్యారు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ



లు ఎన్ని ఉన్నాయి, అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## ఎల్లాపూర్ తాండలో రోడ్డుకు మరమ్మతులు

రాజంపేట, జనవరి 23 (ప్రజాజ్యోతి)
రాజంపేట మండల పరిధిలోని ఎల్లాపూర్ తాండలో గత సంవత్సరం ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పూర్తిగా కొట్టుకుపోయిన ప్రధాన రోడ్డుకు నూతన పాలకవర్గం చొరవతో మరమ్మతులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కలిసి రోడ్డుపై మొరం పోసి తాత్కాలికంగా పునరుద్ధరణ పనులు నిర్వహించారు. వరదల అనంతరం నెలల తరబడి దెబ్బతిన్న రోడ్డుతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, రైతులు రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని గమనించిన నూతన పాలకవర్గం బాధ్యతగా స్పందించి ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేందుకు చర్యలు తీసుకుంది. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, గతంలో నిర్లక్ష్యం చేసిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపారు. రానున్న



రోజుల్లో శాశ్వత రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా ఉన్నతాధికారులను కలిసి ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొని పాలకవర్గం చేపట్టిన పనులకు మద్దతు తెలిపారు. నూతన పాలకవర్గం తీసుకున్న ఈ చర్యపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఓటర్ల అవగాహన దినోత్సవం

బిక్కనూరు,జనవరి 23 (ప్రజాజ్యోతి)
భిక్కనూరు పట్టణంలో గల చౌరస్తాలో తహసిల్దార్ సునీత దేవి సమక్షంలో, ఓటర్ల అవగాహన దినోత్సవ



కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్, ఆర్ ఐ బాలయ్య, పరమాత్మ గౌడ్, జి పి ఓ లు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వృద్ధ ఓటర్లను శాలువాతో సన్మానించారు.

### ఘనంగా వసంత పంచమి వేడుకలు

భిక్కనూరు, జనవరి 23 (ప్రజా జ్యోతి)
భిక్కనూరు పట్టణంలో టీజీవీబీ ఆధ్వర్యంలో వసంత పంచమిని పురస్కరించుకొని శ్రీ సరస్వతి జన్మదినం వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ దేవుని భరత్,కాలేజీ ప్రెసిడెంట్ విజయ్, శ్రీనిధి, కార్యకర్తలు అభి, నరేష్,హారిక, షిరిన్,అంకిత పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు ఇంద్రమ్మ ఇండ్లు మంజూరు

రాజంపేట, జనవరి 23 (ప్రజాజ్యోతి)
రాజంపేట మండల పరిధిలోని ఎల్లాపూర్ తాండ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇంద్రమ్మ ఇండ్లకు శుభారంభంగా ముగ్గు ఓసి ముహూర్త కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,



గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంద్రమ్మ ఇండ్ల పథకం ద్వారా మాలమూల తాండల వరకు అర్హులైన పేద లబ్దిదారులకు ఇండ్ల మంజూరు జరగడం సంతోషకరమని తెలిపారు. తాండాలను గుర్తించి అర్హులైన కుటుంబాలకు ఇంద్రమ్మ ఇండ్లు మంజూరు కావడానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు గారి కృషే ప్రధాన కారణమని పేర్కొన్నారు. పేదల పక్షాన నిలబడి తాండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఎప్పటికీ తమకు అండగా ఉంటారని అన్నారు. ఇంద్రమ్మ ఇండ్ల మంజూరుతో పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరడంతో పాటు వారి జీవన స్థితి మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పేదల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హర్షం వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ల్యాండ్ మార్కింగ్



సదాశివనగర్ జనవరి 23 (ప్రజాజ్యోతి)
సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు గుండెలి మమత, గుండెలి రామవ్వ, ఒడ్డె హనుమంతు, కుమ్మరి వెంకటలక్ష్మి , తూర్పు భారత రాణి, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు మొగ్గుపోసి మార్కింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ టెక్రియాల లావణ్య రమేష్ సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఇళ్ల నిర్మాణం తొందరగా చేసుకొని సకాలంలో నూతన గృహప్రవేశాలు చేరుకోవాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎడ్ల గంగారం, గ్రామ పంచాయతీ పాలకవర్గం, జ్యోతి శ్రీకాంత్, కామెల శ్రీకాంత్, గంగయ్య, నందకుమార్ సెక్రటరీ ప్రకాష్ గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## నూతన గ్రామా పంచాయితీ భవన నిర్మాణానికి భూమిపూజ

నాగిరెడ్డిపేట్,జనవరి23(ప్రజాజ్యోతి):
నాగిరెడ్డిపేట్ మండలంలోని కన్నారెడ్డి గ్రామానికి నూతన పంచాయితీ భవనం మంజూరు కాగా వాటి నిర్మాణ పనులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జనార్ధన్ గౌడ్ భూమి పూజ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నారెడ్డి గ్రామం నూతన



పంచాయతీగా ఏర్పడిందని,ఈ పంచాయితీ భవనానికి 20 లక్షల మంజూరు అయినట్లు ఆయన తెలిపారు.ఈ పంచాయితీ భవనానికి తాండూర్ వాస్తవ్యులు స్థలాన్ని వితరణ చేయడం శుభపరిణామం అని పేర్కొన్నారు.నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో కన్నారెడ్డి గ్రామా సర్పంచ్ సాయిలు,రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి సాయిబాబా,ధర్మారెడ్డి సర్పంచ్ గుల్లపల్లి లక్ష్మి నారాయణ,బంజారా సర్పంచ్ సురేష్,మెట్లకుంట తండా సర్పంచ్ బాల్య నాయక్,రాఘవ పల్లి సర్పంచ్ గంగామణి మల్లేష్,పంచాయితీ కార్యదర్శి రమేష్,నాయకులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె బొగుడ తండా ప్రాథమిక పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్టాపన

నాగిరెడ్డిపేట్,జనవరి23(ప్రజాజ్యోతి):
నాగిరెడ్డిపేట్ మండలంలోని పల్లె బొగుడ తండా ప్రాథమిక పాఠశాలలో శ్రీ సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.పాఠశాలకు



గ్రామా సర్పంచ్ పార్వతి శంకర్ సరస్వతి దేవి విగ్రహాన్ని వితరణ చేశారు.ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి మండల విద్యాధికారి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలలో చక్కటి వాతావరణం ఏర్పాటు చేయడమే కాకుండా చదువుల తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు మంచి బోధన అందించేందుకు ఉపాధ్యాయులు సైతం తమ వంతు కృషిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామా పాలక వర్గ సభ్యులు,గ్రామా పెద్దలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ నేతృత్వంలో వరి సేకరణలో అగ్రస్థానం

- కామారెడ్డి జిల్లాకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

కామారెడ్డి ప్రతినిధి జనవరి 23. (ప్రజాజ్యోతి)
రాష్ట్రంలోని 32 వరి సేకరణ జిల్లాల పనితీరును సివిల్ సప్లై కమిషనర్ సమీక్షించగా, సేకరణ, సయోధ్య, ఎఫ్ సి ఐ క్లెయిమ్‌లు తదితర ఐదు వేర్వేరు కేటగిరీల కింద అత్యుత్తమ పనితీరు కనబరి చిన ఐదు జిల్లాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి విభాగంలో



మెరుగైన పనితీరు కనబ రిచిన జిల్లాలను పౌరస రఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ ప్రశంసించారు.ఈ క్రమంలో రైతులకు సకాలంలో ఎమ్మెస్ పి చెల్లింపులు విభాగంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రైతులకు మూడు రోజుల్లోపు ఎం ఎస్ పి చెల్లింపులు పూర్తిచేయడం ద్వారా జిల్లా అద్భుతమైన పనితీరును కనబరిచినందుకు, కామారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు డి ఎం శ్రీకాంత్‌లకు గౌరవనీయులైన పౌరసరఫరాల శాఖ మంత్రి, సిసిఎస్ చేతుల మీదుగా కమెండేషన్ సర్టిఫికెట్లు శుక్రవారం హైదరాబాద్‌లోని బేగంపేట, ప్రాణహిత హాల్‌లో అందజేశారు. ఈ సందర్భంగా డి సి ఎస్ ఓ డిఎం మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ వారి మార్గనిర్దేశం, సంబంధిత అధికారుల సమన్వయ కృషి ఫలితంగానే కామారెడ్డి జిల్లా వరి సేకరణలో ఈ గొప్ప రాష్ట్ర స్థాయి గుర్తింపును సాధించిందని తెలిపారు.

## కళావేదికను ప్రారంభించిన ఎంఈఓ

- 2 లక్షలతో వేదిక నిర్మాణం
- అభినందించిన రాజాగంగారెడ్డి

బిక్కనూరు జనవరి 23 (ప్రజాజ్యోతి)
ప్రస్తుత జీవన విధానంలో ఎవరికి వారే స్వలాభంతో బ్రతుకుతున్న రోజుల్లో, దీనికి భిన్నంగా కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న పురం మంగ మధుసూదన్ రావు, వారి సోదరి పురం



శ్రీలత లు కలిసి రెండు లక్షల రూపాయలు వెచ్చించి వారి తండ్రి పురం నారాయణ జ్ఞాపకార్ధంగా ఒక అద్భుతమైన కళావే దికను నిర్మించి పాఠశాలకు నూతన వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాజా గంగారెడ్డి మాట్లాడుతూ.... తాను పనిచేసిన పాఠశాలకు ఇంత గొప్ప కానుకను ఇవ్వడమే కాకుండా,భావితరాలకు మంచి వేదికను అందించిన వారిరువురిని అభినందించాడు. ఈ సందర్భంగా దాతలను గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది సన్మానించారు . ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన దేవి, సర్పంచ్ సాయ గౌడ్,ఉపసర్పంచ్ చైతన్య రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ రాజా గౌడ్, బాగా రెడ్డి వార్డు సభ్యులు మరియు పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.